సాక్షి 24|7

వైఎస్ఆర్ జిల్లా

గురువారం 31-8-2017



నవరత్నాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- వివరాలు 7లో ▶



సీబీఆర్ డ్యాంలో అడుగంటిన నీరు

ఈసారీ లేవ్!

- సీబీఆర్‌లో డెడ్ స్టోరేజీకి చేరిన నీటిమట్టం
- కేవలం తాగునీటి అవసరాలకు మాత్రమే కేటాయింపు
- వెంటనే సీబీఆర్‌కు నీటిని విడుదల చేయాలి : వైఎస్ అవినాష్ రెడ్డి
- తాగుకు మాత్రమే...సాగుకు లేదు
- ఎట్టకేలకు 3.77 టీఎంసీల కేటాయింపు
- అనంత ఐఏబీ సమావేశంలో తీర్మానించిన అధికారులు

సాక్షి, కడప :

అనుకున్నట్లే అయ్యింది....ఈసారీ సాగుకు నీరు రావడం కూడా అనుమానంగా మారింది. ప్రతిసారి పులివెందుల ప్రాంతానికి అన్యాయం జరుగుతూనే ఉంది. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏదేదో చేస్తున్నట్లు గొప్పలు చెబుతున్నా వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు విరుద్ధంగా ఉంటోంది. చివరకు అనంతపురంలో బుధవారం జరిగిన సాగునీటి సలహా కమిటీ సమావేశంలో కూడా సాగునీటికి కేటాయింపులు ఎత్తివేశారు. అవసరమైనన్ని జలాలు లేవని, శ్రీశైలం జలాలు వస్తేనే సాగుకు కేటాయిస్తామని సాకుగా చూపి మంత్రులతోపాటు అధికారులు చేతులెత్తేశారు. దీంతో ఈసారికి సాగుకు తుంగభద్ర జలాలు రావడంపై నీలినీడలు అలముకున్నాయి. ఐఏబీ సమావేశంలో తీర్మానించిన మేరకు కూడా అమలు చేయడంలో ప్రతి ఏడాది అధికారులు విఫలమవుతున్నారనే ఆరోపణలు

- మిగతా 2లో ▶

విత్తన కిరికిరి

ఖరీఫ్ సీజన్ చివరి మజిలీలో పదునుపాటి వానలు కురిశాయి. ప్రధాన పంటల సాగుకు అదును మీరిపోవడంతో రైతులు వాటిని సాగు చేయడంలేదు. రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఉచితంగా విత్తనాలను ఇవ్వడానికి ప్రణాళికలు తయారు చేసి పంపిణీకి సిద్ధమైంది. అయితే ఇక్కడనే ప్రభుత్వం మెలిక పెట్టింది. వేరుశనగ పంట సాగు చేయని వారికి మాత్రమే ప్రత్యామ్నాయ విత్తనాలు ఇవ్వనున్నట్లు తేల్చి చెప్పింది. ఒకవేళ ఎవరైనా వేరుశనగ సాగు చేసిన రైతులు సాహసించి ప్రత్యామ్నాయ విత్తనాలు తీసుకుంటే రాబోయే ఇన్‌పుట్ సబ్సిడీ కట్ అవుతుందని కరాఖండిగా చెబుతున్నట్లు సమాచారం. దీంతో అన్నదాతలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.



- విత్తనాలు తీసుకుంటే.. ఇన్‌పుట్ సబ్సిడీ కట్
- వేరుశనగ సాగు చేయని వారికే విత్తనాలు
- ఆందోళనలో రైతులు

జిల్లాలో సాధారణ వేరుశనగ సాగు విస్తీర్ణం **36,575** హెక్టార్లు

ఇప్పటివరకు సాగైంది **21,650** హెక్టార్లు

బీడు భూమి **14,925** హెకార్లు

ప్రత్యామ్నాయ విత్తనాల కోసం ఎంపికైన మండలాలు **18**

ప్రభుత్వం కేటాయించిన విత్తనాలు **1,920** క్వింటాళ్లు

(100 శాతం సబ్సిడీతో ఇవ్వాలని నిర్ణయించింది)

కేటాయించిన విత్తనాలు ఇలా..	
అలసందలు	1,250 క్వింటాళ్లు
మినుములు	120 క్వింటాళ్లు
పెసలు	50 క్వింటాళ్లు
ఉలవలు	500 క్వింటాళ్లు

కడప అగ్రికల్చర్:

పంటల సాగుకు అవసర రీత్యా విత్తనాలు పొందడంలో తప్పేమిటని రైతు సంఘాలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో సాగుచేసినా, చేయకపోయినా ప్రత్యామ్నాయ పంటల సాగుకు విత్తనాలు ఉచితంగా ఇస్తున్నా ఇక్కడ లేనిపోని ఆంక్షలేమిటని సంఘాలు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నాయి. జిల్లాలో ప్రధాన పంట వేరుశనగ సాగు

- మిగతా 2లో ▶

ఫలించిన పోరాటం

ఫాతిమా మెడికల్ కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత వైద్యవిద్యార్థులు, వారి తల్లిదండ్రులు(ఫైల్)



- సుప్రీంకోర్టు నోటీసులతో సర్దుతామంటున్న రాష్ట్ర ప్రభుత్వం
- విద్యా సంవత్సరాన్ని కోల్పోనున్న బాధిత వైద్య విద్యార్థులు
- 2017లో కొత్తగా 13 కళాశాలల్లో చేర్చనున్న వైనం
- 99 మంది విద్యార్థులు ఏడాది కాలంగా ఉద్యమ బాట
- ఇక నుంచైనా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి

కళాశాల యాజమాన్యం తీరుతో వంద మంది వైద్యవిద్యార్థులు మోసపోయారు. ఎన్నో వ్యయప్రయాసలతో సాధించుకున్న వైద్య విద్యకు ఎంసీఐ అనుమతి లేదని తెలిసి వారంతా రోడ్డునపడ్డారు. ఏడాది కాలంగా పోరాటం చేస్తూనే ఉన్నారు. కలవని నేత లేరు.. కడప నుంచి ఢిల్లీ దాకా అవసరమైన అన్ని కార్యాలయాలకు వెళ్లారు. చివరకు ఆత్మహత్యలే తమకు దిక్కు అంటూ కళాశాల పైకెక్కారు. ఉద్యమబాటలో చివరకు న్యాయపోరాటం చేసి గెలిచారు. ఇదీ కడప సమీపంలోని ఫాతిమా మెడికల్ కళాశాలలో సీట్లు పొందిన వైద్య విద్యార్థుల గాథ. సుప్రీంకోర్టు స్పందించి రాష్ట్రప్రభుత్వానికి, ఎంసీఐకి నోటీసులు పంపడంతో వారికి ఊరట లభించినట్లయింది. కానీ ఇతర కళాశాలలో సీట్లు వచ్చేనా? ఇకనైనా తమకు న్యాయం జరిగేనా? అని వారి తల్లిదండ్రులు కొంత సంశయంలో ఉన్నారు.

- వివరాలు 2లో ▶

పేకాట ఆడుతూ పట్టుబడిన హెడ్ కానిస్టేబుల్ 3లో

నడుస్తూ.. నడిపిస్తూ.. 6లో

విత్తన కిరికిరి

▶ మొదటిపేజీ తరువాయి

చేయగా మిగిలిపోయిన భూమికి మాత్రమే విత్తనాలు ఇస్తున్నామని వ్యవసాయాధికారులు చెబతున్నారు. వేరుశనగ పంటను జూన్‌లో సాగు చేయగా జూలై, ఆగస్టు చివరివారం దాకా వానలు లేకపోవడంతో ఎదుగుబొదుగు లేనందున దున్నేశామని, రబీ దాకా భూమిని బీడుగా పెట్టడం ఎందుకని ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకుంటామంటే ప్రభుత్వం ఈ కొత్త మెలికపెట్టడడం ఏమిటని రైతులు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో అడ్డదారుల్లో గెలవడానికి రూ.కోట్లు ఖర్చు పెడతారుగాని అన్నదాతలకుఉచితంగా విత్తనాలు ఇవ్వడానికి చేతులెందుకు రావడం లేదని రైతు సంఘాలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. కరువుతో అల్లాడుతున్న రైతులకు ఇప్పుడు కురిసిన వర్షాలకు ఏదో ఒక పంట సాగు చేసుకుంటామంటే విత్తన మెలికలు పెట్టడం ఏమిటని రైతు సంఘాలు నిలదీస్తున్నాయి.

ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు బయోమెట్రిక్ విధానం ద్వారా రైతులకు పంపిణీ చేయనున్నారు. అయితే గతంలో వేరుశనగ విత్తన కాయలను పొందిన వారు వీటిని తీసుకుంటే ఇన్‌పుట్ సబ్సిడీ రాదు. ఒకవేళ తీసుకున్నా ఒకే సీజన్‌లో రెండు పంటలు ఎలా సాగు చేశారని రాష్ట్ర వ్యవసాయశాఖ మెలిక పెట్టినట్లు సమాచారం. ఇప్పటికే అటు రెవెన్యూ, ఇటు వ్యవసాయశాఖ పంటలసాగు వివరాలను క్రాప్ బుకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసింది. దీంతో విత్తనాలు పొందడానికి వీలు లేకుండా పోతోంది. కరువు అన్నదాతలను అన్ని విధాలా ఆదుకుంటామంటూ ఒక పక్క చెబుతూనే మరో పక్క మెలికలు పెట్టడం ఏమిటని రైతులు, రైతు సంఘాలు దుమ్మెత్తి పోస్తున్నాయి. వర్షాభావం వల్ల పంటలు కోల్పోయిన రైతులకు ఉచితంగా విత్తనాలు ఇచ్చినా తప్పులేదని వ్యవసాయశాఖ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లుగా పంటలు పండక, సాగుకు చేసిన అప్పులు తీర్చలేక అల్లాడుతున్నా.. ఈ ప్రభుత్వానికి ఏ మాత్రం రైతుల ఘోష వినిపించడంలేదని రైతు సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

రైతులందరికి ఉచితంగా విత్తనాలు ఇవ్వాలి



వర్షభావంతో భూములు బీడుగా పెట్టుకున్న రైతులకు, పంటలు ఎండిపోయి దున్నేసిన వారికి విత్తనాలు ఇచ్చితీరాలి. కరువుతో అల్లాడుతుంటే ఎందుకు విత్తనాలు ఇవ్వకూడదో చెప్పాలి. నంద్యాల ఉప ఎన్నికల్లో ఓట్ల కోసం రూ.కోట్లు ఖర్చు పెట్టిన ప్రభుత్వం రైతులకు ఇచ్చేదాంట్లో చేతులు రావడం లేదు.

-జి చంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ రైతు సంఘం(సీపీఐ)

రైతులంటే ఈ ప్రభుత్వానికి చిన్న చూపు



మొదటి నుంచి ఈ ప్రభుత్వానికి రైతులంటే చిన్న చూపు. వారికి ఏదైనా ఉచితంగా ఇవ్వాలంటే ఒక మెలిక పెడుతూనే ఉంది. మొన్నటి మొన్న ఇన్‌పుట్ సబ్సిడీకి, పంట బీమాకు మెలిక పెట్టింది. ప్రతిపక్ష పార్టీ, రైతు సంఘాలు, రైతులు ఆందోళనకు దిగుతాయని భయపడి రెండు ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. ఇప్పుడు కూడా ఐక్యతతో అందరూ కలిసి పోరాడితే రైతులందరికి విత్తనాలు ఇస్తారు.

-లింగమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి, రాయలసీమ రైతు సంఘం(ఆర్‌సీపీ)

ఫలించిన పోరాటం

సాక్షి, కడప : కళాశాల యాజమాన్యం నమ్మించి మోసం చేసిన వ్యవహారంతో అటు తల్లిదండ్రులతోపాటు ఇటు విద్యార్థులు నరకయాతన అనుభవించారు. సుమారు 99మంది విద్యార్థులు ఫాతిమా మెడికల్ కళాశాలలో అడ్మిషన్ పొందినా చివరకు అక్కడ ఎంసీఐ అనుమతి లేని నేపథ్యంలో ప్రతిరోజు వేదన అనుభవించాల్సి వస్తోంది. రోడ్డెక్కి ఉద్యమం చేస్తూనే మరోపక్క చేసిన న్యాయ పోరాటంతో వారికి వైద్య విద్య అభ్యసించేందుకు అవకాశం లభిస్తున్నా... అనవసరంగా ఏడాది కోల్పోయామన్న బాధ స్పష్టంగా కనిపిస్తోంది. సుప్రీంకోర్టు నోటీసుల నేపథ్యంలోనైనా వారికి న్యాయం జరగాలని కోరుకుందాం.

విద్యా సంవత్సరాన్ని కోల్పోయిన విద్యార్థులు

ఫాతిమా మెడికల్ కళాశాలలో చేరి ఇబ్బందులు పడ్డ సుమారు 99 మంది విద్యార్థులు ఏడాదిపాటు విద్యా సంవత్సరాన్ని కోల్పోనున్నారు. అనుమతిలేక ఏడాదిన్నరకు పైగా పోరాటం చేస్తూ వచ్చిన వారికి ఓ రకంగా ఈ సంవత్సరం అవకాశం కల్పిస్తున్నా ఏడాది అనవసరంగా పోయిందన్న బాధ వెంటాడుతోంది. మరోపక్క ఉన్న విలువైన ఆస్తులను కుదవపెట్టి ఫీజుల రూపంలో రూ.లక్షలు సరైన సమయంలోనే కట్టినప్పటికీ విద్యా సంవత్సరం నష్టపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి

మెడికల్ కళాశాలల్లో చేర్పించే సమయంలో తల్లిదండ్రులు కొంతైనా జాగ్రత్తలు తీసుకోవాలని మేధావులు కోరుతున్నారు. ఎందుకంటే ఇప్పుడు ఫాతిమా విద్యార్థులకు జరిగిన నష్టం అంతా ఇంతా కాదు. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో మెడిసిన్ చదివే విద్యార్థులకు సంబంధించి తల్లిదండ్రులు కళాశాలకు సంబంధించి ఎంసీఐ గుర్తింపు ఉందా? సరైన ఫ్యాకల్టీ ఉన్నారా? రేటింగ్‌లో ఇండియా, ఏపీలో స్థానమెంత? ఏ గ్రేడ్‌లో ఉంది? సరైన సౌకర్యాలు ఉన్నాయా? లేదా? మెడికల్ కళాశాలకు సంబంధించి అనుబంధంగా ఆస్పత్రి ఉందా..లేదా? అక్కడి పరిస్థితులపై లోతుగా కొంత అధ్యయనం చేసి పిల్లలను చేర్చేందుకు సిద్ధపడాలి. ఆయా అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

2017 ప్రకారం కళాశాలలో అడ్మిషన్

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 99 మంది విద్యార్థులు 2015–16 సంవత్సరానికి సంబంధించి మెడిసిన్ చదివేందుకు కడప నగర శివార్లలోని ఫాతిమా మెడికల్ కళాశాలలో అడ్మిషన్ పొందారు. అయితే కళాశాలలో పది నెలల పాటు తరగతులు నిర్వహించారు. అయితే కళాశాలకు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) నుంచి అనుమతి లభించకపోవడం రూ.లక్షల్లో ఫీజుల రూపంలో కట్టిన మొత్తాలు వెనక్కి రాకపోవడంతో అందరిలోనూ అలజడి ప్రారంభమైంది. కళాశాల ఎదుట మొదలైన ఆందోళన తర్వాత కడపలో రాస్తారోకో, కలెక్టరేట్ ఎదుట దీక్షల వరకు కొనసాగింది. చివరకు ఢిల్లీ వరకు ఆందోళన కథ నడిచింది. ఢిల్లీలో కూడా ప్రత్యేకంగా నిరసన దీక్షలు చేపట్టడంతోపాటు కేంద్రమంత్రులను సైతం కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. అయితే ఎంత పోరాటం చేసినా చివరకు విద్యార్థుల వేదనను సుప్రీంకోర్టు ఆలకించింది. దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలతో కేంద్ర, రాష్ట్రప్రభుత్వం వారికి 2017 విద్యా సంవత్సరంలో అవకాశం కల్పించనున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ తెలిపారు. ఎట్టకేలకు వారికి ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అవకాశం లభించనుంది.

ఈసారీ లేవ్!

▶ మొదటిపేజీ తరువాయి

ఉన్నాయి. కేటాయింపుల్లో ఒకటి, అమలులో మరొకటి కనిపిస్తుండడం కూడా అనుమానాలకు తావిస్తోంది.

తాగునీటికి మాత్రమే కేటాయింపులు

‘సీమ’లోని అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాలోని ప్రజాప్రతినిధులతోపాటు ఆయా ప్రాజెక్టుల అధికారులు పాల్గొన్న ఐఏబీ సమావేశంలో కేవలం తాగునీటికి మాత్రమే కేటాయింపులు జరిగాయి. మొదటి ప్రాధాన్యతగా తాగునీటికి మాత్రమే తుంగభద్ర ప్రాజెక్టు నుంచి నీటి విడుదలకు సన్నద్ధమయ్యారు. భారీవర్షాలు కురిసి తుంగభద్ర, శ్రీశైలం ప్రాజెక్టులకు భారీగా నీరు వచ్చి చేరితేనే కేటాయిస్తారు. లేకపోతే చుక్కనీరు కూడా సాగుకు అందించే పరిస్థితులు కనిపించడం లేదు. తుంగభద్ర నుంచి అన్నోఇన్నో నీటిని బుధవారమే హైలెవెల్ కెనాల్ (హెచ్‌ఎల్‌సీ)కి విడుదల చేశారు. అయితే హెచ్‌ఎల్‌సీకి సంబంధించే 9.80 టీఎంసీ కేటాయించిన నేపథ్యంలో పులివెందుల బ్రాంచ్ కెనాల్‌కు ఎంతమాత్రం నీరు వస్తుందన్నది వేచిచూడాల్సిందే!

సీబీఆర్‌లో అడుగంటిన జలం

చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో ప్రస్తుతం నీరు లేక ప్రాజెక్టు బోసిపోయింది. సీబీఆర్‌లో డెడ్‌స్టోరేజీ 0.44 టీఎంసీ కాగా, ప్రస్తుతం 0.01కు చేరింది. విపత్కర పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఎందుకంటే ఇక్కడి నుంచే అనంతపురం జిల్లాలోని కదిరి, ధర్మవరం, పుట్టపర్తి నియోజకవర్గాలకు తాగునీరు, పులివెందుల నియోజకవర్గంలోని 120 గ్రామాలకు తాగునీటిని అందించే పంపులకు నీరందక ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నానాయాతన పడుతున్నారు. ప్రస్తుతం సీబీఆర్‌లో నీరు అడుగంటడంతో పంపులకు కూడా సరిగా అందడం లేదు.

3.77 టీఎంసీల కేటాయింపు

పులివెందుల ప్రాంత ప్రాణాధారమైన పులివెందుల బ్రాంచ్ కెనాల్‌కు సాగునీరు అందడం ఈసారి కూడా అనుమానంగానే కనిపిస్తోంది. ప్రధాన జీవనాధారమైన ప్రాజెక్టు ఏడాదికేడాదికి నిర్వీర్యమవుతోంది. పీబీసీకి 4.4 టీఎంసీల నీటి కోటా ఉండగా ప్రతి సంవత్సరం అరకొర కేటాయింపులతోనే సరిపెడుతున్నారు. ఈసారి కూడా ఐఏబీ సమావేశంలో 3.77 టీఎంసీల నీటి కేటాయింపులకు ఆమోదం తెలిపినా ఎన్ని విడుదల చేస్తారన్నది తెలియడం లేదు. ఏదో ఒక సాకుతో నీటి విషయంలో ఎగనామం పెడుతున్నారు. ప్రస్తుత కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఒకపక్క అల్లాడిపోతున్నారు. పీబీసీకి సంబంధించి జిల్లాలో 55 వేల ఎకరాల ఆయకట్టుతోపాటు అనంతపురం జిల్లాలో ఐదు వేల ఎకరాలు కలుపుకొని మొత్తం మీద 60 వేల ఎకరాల ఆయకట్టు ఉంది.



పులివెందుల ప్రాంత రైతాంగానికి ప్రతిసారి అన్యాయమే జరుగుతోంది. కావాల్సినన్ని నీటిని ఇవ్వడంలో ప్రభుత్వం పక్షపాతంగా వ్యవహరించడం తగదని, పులివెందుల పరిధిలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ అడుగంటిన నేపథ్యంలో తాగునీటి అవసరాల దృష్ట్యా వెంటనే నీటిని విడుదల చేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. అందుకు సంబంధించి ఐఏబీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీబీ డ్యాంలో 64 టీఎంసీలు ఉన్నాయి..ఇన్‌ఫ్లో కూడా అంతో ఇంతో బాగానే ఉంది. అయితే గతంతో పోలిస్తే నీటి లభ్యత తగ్గింది. అయితే పెన్నా అహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు తాగునీటికి నిర్దేశించినవని, ప్రస్తుతం సీబీఆర్‌లో 0.1 టీఎంసీ మాత్రమే ఉన్నాయని ఆయన తెలియజేశారు. ఇలాంటి పరిస్థితుల్లో పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, పులివెందులలో తాగునీటి పథకాలకు నీరందక పనిచేయడం లేదని ఆయన తేల్చిచెప్పారు. చిత్రావతికి ఎప్పుడూ అన్యాయమే జరుగుతోందని, అన్నోఇన్నో కేటాయింపుల్లో చేసినా అందించడంలో ఏదో ఒకచోట నీరు జారిపోతూనే ఉందని ఆయన తెలియజేశారు. మిడ్ పెన్నార్ రిజర్వాయర్ నుంచి వెంటనే సీబీఆర్‌కు నీరు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి ఏడాది నీరు సక్రమంగా రాక పులివెందుల ప్రాంతంలో చీనీ చెట్లు ఎండిపోతున్నాయని... సాగునీటికి అందించి కాపాడాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

పేకాట ఆడుతూ పట్టుబడిన హెడ్ కానిస్టేబుల్

సాక్షి, కడప: సింహాద్రిపురం మండలం బిదినంచర్లలో జూదం ఆడుతూ ఓ హెడ్ కానిస్టేబుల్ పట్టుబడినట్లు సమాచారం. వివరాలు ఇలా ఉన్నాయి. బిదినంచర్లలో పేకాట ఆడుతున్నట్లు మంగళవారం రాత్రి సమాచారం రావడంతో ఎస్ఐ సంజీవరెడ్డి వెళ్లి వారిని పట్టుకున్నారు. జూదమాడుతున్న వారిలో లింగాల పోలీస్ స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఉన్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా 8మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.42వేలు స్వాధీనం చేసుకున్నారు. అయితే జూదమాడుతున్న వారి పేర్లను పోలీసులు వెల్లడించకపోవడానికి కారణం అందులో హెడ్ కానిస్టేబుల్ ఉండటమేనని తెలుస్తోంది. ఆ హెడ్ కానిస్టేబుల్ స్వగ్రామం బిదినంచర్ల కావడంతో గ్రామస్తులు, ఇతరులతో కలిసి జూదంలో పాల్గొన్నట్లు తెలిసింది. ఈ విషయంపై ఎస్ఐ సంజీవరెడ్డిని వివరణ కోరగా వెంకట్రాముడుతోపాటు మరో ఏడుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

అదనపు కట్నం కేసులో ఇద్దరి అరెస్టు

పోరుమామిళ్ల : అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్న కేసుకు సంబంధించి పోలీసులు ఇద్దరిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచగా 15 రోజుల రిమాండ్ విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి. రంగసముద్రం పంచాయతీ గిరినగర్‌కు చెందిన ముత్యాల సుగంధి ఇచ్చిన ఫిర్యాదుపై పోరుమామిళ్ల పోలీసులు 498ఎ సెక్షన్ కింద పదిరోజుల క్రితం కేసు నమోదు చేశారు. ఆ కేసు విచారించిన బద్వేలు మెజిస్ట్రేట్ మంగళవారం సుగంధి భర్త బండి శ్రీనివాసులు, అతని అన్న ఓబులేసులకు 15 రోజులు రిమాండ్‌కు ఆదేశించినట్లు పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి... సుగంధికి 2013లో దాదాపు రూ. 8 లక్షలు కట్నం ఇచ్చి శ్రీనివాసులుతో వివాహం జరిపించారు. చెన్నైలో పీహెచ్‌డీ చేస్తున్న శ్రీనివాసులు ఓ మూడు నెలలు సజావుగా కాపురం చేసి, ఖర్చులు పెరిగి ఇబ్బందిగా ఉందని చెప్పి సుగంధిని పోరుమామిళ్లలో తల్లిదండ్రుల వద్ద వదిలి వెళ్లాడు. ఆ తరువాత అతనికి మంచి ఉద్యోగం వస్తుందని తెలిసి, సుగంధిని వదిలించుకోవాలని భావించాడు. దీంతో అతని అన్న ఓబులేసు మాటలు విని అదనపు కట్నం కోసం వేధించడం మొదలు పెట్టాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు.

డ్రగ్స్ కేసులో పోలీసుల అదుపులో మైదుకూరు వాసి

కడప అర్బన్ : హైదరాబాదులో సంచలనం సృష్టిస్తున్న డ్రగ్స్ కేసులో మైదుకూరుకు చెందిన ఓ వ్యక్తి పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. హైదరాబాదులో నివాసమంటున్న ఇతనికి డ్రగ్స్ కేసులో ఉన్న పలువురితో సంబంధాలు ఉన్నట్లు పోలీసుల విచారణలో తెలియడంతో అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ మేరకు అతని విచారిస్తున్నట్లు తెలిసింది.

రైల్వేకోడూరులో వరుస చోరీలు



బాధితులను విచారిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు మండలంలోని రాఘవరాజపురం ప్రధాన రహదారిలో మంగళవారం రాత్రి మూడు ఇళ్లలో చోరీ జరిగింది. సుమారు రూ.2లక్షలకు పైగా బంగారు, ఒక ద్విచక్రవాహనాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు బుధవారం ఉదయాన్నే సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... తాళ్లపాక చంద్రారెడ్డికి చెందిన ఇంటికి రాత్రి సమయంలో తాళం వేసి పక్క గదిలో నిద్రిస్తుండగా ఇంటి తాళాలు పగులకొట్టి రూ.2లక్షలు విలువచేసే 19 గ్రాముల బంగారు నగలతో పాటు రూ.40వేలు నగదు తీసుకెళ్లారు. అలాగే పక్కనే ఉన్న టీవీఎస్ ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లారు. నిమ్మకాయల లక్ష్మిరెడ్డి, నిమ్మకాయల పాల్‌రెడ్డి ఇళ్లకు తాళాలు వేసి ఉండగా రెండు ఇళ్ల తలుపులు పగులకొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. పాల్‌రెడ్డి ఇంట్లో జత కమ్మలు, రూ.16వేల నగదు దొంగిలించారు. ఒకేరోజు మూడు ఇళ్లలో చోరీలు జరగడంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

జల్సాలకు బానిసలై..

దొంగలుగా మారి..

- ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తూ..
- కడప సీసీఎస్ పోలీసులకు దొరికిన యువకులు
- 21 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- నిందితుల్లో కడప, ప్రొద్దుటూరు యువకులు
- విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ బాబూజీ అట్టాడ



రికవరీ చేసిన ద్విచక్ర వాహనాలు (ఇన్‌సెట్) వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ బాబూజీ అట్టాడ



కడప అర్బన్ :

యుక్త వయసులో ఉన్న వారు సన్మార్గంలో పయనించి తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి. కానీ కొందరు దురలవాట్లకు బానిసలై, జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించాలని వక్ర మార్గాన్ని ఎంచుకుంటున్నారు. ద్విచక్ర వాహనాల చోరీకి ప్పాలడటం.. వాటిని విక్రయించగా వచ్చే సొమ్ముతో జల్సాలకు పాల్పడుతున్న ఐదుగురు యువకులను కడప సీసీఎస్ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి తమ సిబ్బందితో అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.10.20 లక్షల విలువైన 21 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ దొంగల ముఠా అరెస్ట్, ద్విచక్రవాహనాల రికవరీ వివరాలను బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ బాబూజీ అట్టాడ విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

- అరెస్టయిన వారిలో ప్రొద్దుటూరు పట్టణం వెంకటేశ్వర పేటకు చెందిన గడ్డం విష్ణు (20) అనే యువకుడు కడపలోని ఓ ఫిజియోథెరఫీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇతనిపై 14 ద్విచక్రవాహనాల చోరీ కేసులున్నాయి.
- కడప నగరం, రవీంద్రనగర్‌లోని నబీకోటలో నివసిస్తున్న పోసా మధుసూదన్ అలియాస్ మధు (23) డిగ్రీ చదువుకుని డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతనిపై ఒక కేసు నమోదైంది.
- కడప నగరం రవీంద్రనగర్‌లో నివసిస్తున్న చల్లా సుదర్శన్ (21) ఇంటర్ వరకు చదువుకున్నాడు. మెడికల్ రెప్రెజెంటేటివ్‌గా పని చేస్తున్నాడు. ఇతనిపై రెండు ద్విచక్రవాహనాల కేసులున్నాయి.
- చంగాల శ్రీనివాస్ అలియాస్ శ్రీ (21) ఇంటర్ పూర్తి చేసి, ఓపెన్ డిగ్రీ చదువుతూ కొరియర్ బాయ్‌గా పని చేస్తున్నాడు. ఇతనిపై మూడు ద్విచక్ర వాహనాల కేసులు ఉన్నాయి.
- కడప నగరం భవానీనగర్‌కు చెందిన జల్లా శివకుమార్ అలియాస్ బాబు (28) తెలంగాణ రాష్ట్రం భువనగిరిలో కాంట్రాక్ట్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. ఒక ద్విచక్రవాహనం కేసు ఇతనిపై నమోదైంది. వీరందరి వద్ద నుంచి రూ. 10.20 లక్షల విలువైన 21 ద్విచక్రవాహనాలను రికవరీ చేశామనీ ఎస్పీ వివరించారు.
- ఈ ముఠాలోని ప్రధాన నిందితుడు విష్ణు మైదుకూరులో ఓ ద్విచక్రవాహనాన్ని దొంగిలిస్తుండగా సీసీ పుటేజీలకు చిక్కాడు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను పసిగట్టి అరెస్ట్ చేశారు. ఈ కేసులో నిందితులను అరెస్టు చేయడంలో కృషి చేసిన కడప సీసీఎస్ డీఎస్పీ జి. నాగేశ్వర్ రెడ్డి, సీసీఎస్ ఎస్ఐలు ఎన్‌వి నాగరాజు, ఎల్ జీవన్ రెడ్డి, చిన్నచౌక్ ఎస్ఐ ఆర్. మోహన్, రిమ్స్ ఎస్ఐ ఎస్. కుళ్లాయప్ప, సీసీఎస్ ఏఎస్ఐ ఎంసీ నాగమల్లయ్య, హెడ్ కానిస్టేబుళ్లు విశ్వనాథరెడ్డి, సతీష్ కుమార్, రమణ, పిఆర్‌వి రాజు, కానిస్టేబుళ్లు బి. బాషా, బి. బాలరాజు, శ్యాం ప్రసాద్, ప్రభు, సుధాకర్ రెడ్డిలను ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ ఏ. శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్సు పోయిందని మహిళ ఫిర్యాదు

కడప అర్బన్ : కడప నగరానికి చెందిన గీతాంజలి అనే మహిళ ఈనెల 29న తిరుపతికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌కు ఆటోలో వచ్చింది. అక్కడ ఆటోలో పర్సు పోగొట్టుకున్నట్లు అందులో రూ. 9200 నగదు ఉన్నట్లు బుధవారం చిన్నచౌక్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ప్రభాకర్ తెలిపారు.

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

కడప అర్బన్ : కడప నగరంలోని ప్రకాశ్‌నగర్‌కు చెందిన గోటూరు వీరాంజనేయులు (23) అనే యువకుడు కనుమలోపల్లె–కడప మార్గమధ్యంలో దిగువ రైల్వేట్రాక్‌పై పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఎందుకు మృతి చెందాడన్న విషయం తెలియాల్సి ఉంది. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగరాజు నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రెండు మోటార్ బైక్‌లు ఢీ

నలుగురికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన ఇండ్ల ఓబయ్య

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల సమీపంలోని సీతారాంపురం రోడ్డులోని తెలుగుగంగ కాలువ సమీపంలో బుధవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో రెండుమోటార్‌బైక్‌లు ఢీ కొనడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన చిన్నాయపల్లెకు చెందిన ఇండ్ల ఓబయ్య(62) పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. చల్లగిరిగెలకు చెందిన పెళ్లూరి కొండయ్య(55)కు కుడికాలు విరిగింది. మంగనపల్లెకు చెందిన దగ్గుపాటి గురయ్యకు, చిన్నాయపల్లెకు చెందిన ఇండ్ల ఓబులేసుకు తీవ్ర గాయాలయ్యాయి. చల్లగిరిగెలకు చెందిన గురయ్య, కొండయ్య, మంగనపల్లెకు చెందిన గురయ్య ఒకే మోటార్‌బైక్‌పై పోరుమామిళ్ల నుంచి ఇంటికి వెళుతుండగా చిన్నాయపల్లె నుంచి ఇండ్ల ఓబయ్య, ఓబులేసు మరో బాలుడు ఒకే మోటార్ బైక్‌పై పోరుమామిళ్ల వస్తున్నారు. తెలుగుగంగ కాలువ వద్ద రెండు బైక్‌లు వేగంగా ఢీ కొనడంతో వీరికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తెచ్చారు.

ఇద్దరు దోపిడీ దొంగల అరెస్టు

మదనపల్లె క్రైం : దారి దోపిడీకి పాల్పడిన ఇద్దరు పాత నేరస్తులను పోలీసులు అరెస్టు చేశారు. చిత్తూరు జిల్లా మదనపల్లె డీఎస్పీ చౌడేశ్వరి బుధవారం విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. వైఎస్సార్ జిల్లా కమలాపురానికి చెందిన రైతు బుడ్డారెడ్డి కుమారుడు కొండు కొండారెడ్డి ఈ నెల 11న బియ్యం బస్తాలను కర్ణాటకలోని బంగారుపేటలో విక్రయించాడు. అదే రోజు రాత్రి రూ.70,700 తీసుకుని మదనపల్లె బస్టాండుకు వచ్చాడు. రాత్రి 11 గంటల సమయంలో కడప బస్సు కోసం మదనపల్లె ఆర్టీసీ బస్టాండులో ఉండగా పాత నేరస్తులైన పీటీఎం మండలం సంపత్‌కోటకు చెందిన కోటకొండ సుధాకర్(45), కురబలకోట మండలం దొమ్మనబావి శీను అలియాస్ శీన(29) పథకం ప్రకారం కొండారెడ్డికి మాయ మాటలు చెప్పి ఆటోలో సీటీఎం రోడ్డుకు తీసుకెళ్లారు. అక్కడ ఓ ఆశ్రమం వెనుకకు తీసుకెళ్లి వ్యాపారిపై దాడిచేసి డబ్బు లాక్కెల్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ నిరంజన్‌కుమార్, టూటౌన్ ఎస్ఐలు గంగిరెడ్డి, నాగేశ్వరావు కేసు దర్యాప్తు చేసి నిందితులను అరెస్టు చేశారు. నిందితుల నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు.




నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ చౌడేశ్వరి

కోర్టు ఫీజు కట్టేందుకే దోపిడీ: గతంలో వీరు నలుగురు నిందితులతో కలిసి దోపిడీలు, హత్యలు చేసేవారు. ఈ కేసుల్లో మదనపల్లె టూటౌన్, పలమనేరు, వాల్మీకిపురం పోలీసు స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల విచారణ స్థానిక ఏడీజే కోర్టులో చివరి దశలో ఉండడంతో కోర్టు ఫీజుల నిమిత్తం డబ్బు అవసరమై తిరిగి సుధాకర్, శీను దోపిడీ చేశారని డీఎస్పీ తెలిపారు. వీరిపై ఇది వరకే ఆయా పోలీస్ స్టేషన్లలో రౌడీ, కేడీ షీట్లు తెరిచినట్టు పేర్కొన్నారు. నిందితులను పట్టుకోవడానికి కృషి చేసిన ఎస్ఐలను డీఎస్పీ చౌడేశ్వరి అభినందించారు.

భవిష్యం

మేషం: పనుల్లో జాప్యం. ఆర్థిక ఇబ్బందులు తప్పకపోవచ్చు. ఆకస్మిక ప్రయాణాలు. ఆలయ దర్శనాలు. అనారోగ్యం. వృత్తి, వ్యాపారాలలో చికాకులు.

వృషభం: శ్రమాధిక్యం. పనుల్లో తొందరపాటు. ప్రయాణాలలో అవాంతరాలు. వ్యయప్రయాసలు. బంధువులతో తగాదాలు. వృత్తి, వ్యాపారాలు మందగిస్తాయి.



మిథునం: చిరకాల స్వప్నం నెరవేరుతుంది. విద్యావకాశాలు. ప్రముఖులతో పరిచయాలు. పలుకుబడి పెరుగుతుంది. వ్యాపార, ఉద్యోగాలలో నూతనోత్సాహం.

కర్కాటకం: కొత్త విషయాలు తెలుసుకుంటారు. ఆర్థిక ప్రగతి. పరిచయాలు పెరుగుతాయి. శుభవార్తలు. వాహనయోగం. వ్యాపారాలు విస్తరిస్తారు. ఉద్యోగులకు కొత్త హోదాలు.

సింహం: పనుల్లో అవాంతరాలు. వృథా ఖర్చులు. బంధువులతో మాటపట్టింపులు. అనారోగ్యం. ఆలయాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలలో గందరగోళ పరిస్థితి.

కన్య: కొన్ని సమస్యలు వేధిస్తాయి. ఆరోగ్యభంగం. ముఖ్యమైన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. దూరప్రయాణాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో చికాకులు పెరుగుతాయి.

తుల: పరిచయాలు పెరుగుతాయి. ఆసక్తికర సమాచారం. విందువినోదాలు. యత్నకార్యసిద్ధి. ఉద్యోగావకాశాలు. వృత్తి, వ్యాపారాలలో ఉత్సాహవంతంగా ఉంటుంది.

వృశ్చికం: కుటుంబ, ఆరోగ్యసమస్యలు. వ్యయప్రయాసలు. ఆదాయానికి మించిన ఖర్చులు. ప్రయాణాలు వాయిదా. వృత్తి, వ్యాపారాలలో నిరుత్సాహం.

ధనుస్సు: చిన్ననాటి మిత్రుల కలయిక. విందువినోదాలు. కార్యజయం. భూములు, వాహనాలు కొంటారు. వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. ఉద్యోగులకు పదోన్నతులు.

మకరం: శ్రమ పెరుగుతుంది. ఆకస్మిక ప్రయాణాలు. ఇంటాబయటా ఒత్తిడులు. దైవ దర్శనాలు. అనారోగ్యం. వృత్తి, వ్యాపారాలలో నిరాశ.

కుంభం: పలుకుబడి పెరుగుతుంది. శుభవార్తలు. వాహనయోగం. చర్చలు ఫలిస్తాయి. వస్తులాభాలు. వ్యాపారాలలో పురోగతి. ఉద్యోగులకు విధుల్లో చికాకులు తొలగుతాయి.

మీనం: పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. సన్నిహితుల సాయం అందుతుంది. వ్యాపారాలు, ఉద్యోగాలలో అనుకూలత.

– సింహంభట్ల సుబ్బారావు

ఆర్టీసీ పార్శిల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

పులివెందుల రూరల్:

ఆర్టీసీ ప్రవేశ పెట్టిన పార్శిల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కడప ఆర్టీసీ రీజనల్ మేనేజర్ చెంగల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన నూతన పార్శిల్ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కండక్టర్లు, డ్రైవర్లు అంకిత భావంతో పనిచేసి పార్శిల్‌ను నిర్దేశించిన ప్రాంతంలో డెలివరీ ఇవ్వాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 57వేల మంది సిబ్బంది.. 12వేల సర్వీసులతో నడుస్తున్న సంస్థ ఏడాదికి రూ.150 కోట్లు పార్శిల్ ద్వారా ఆదనపు ఆదా యం సాధించాలన్నదే లక్ష్యమన్నారు. ఇందులో 7శాతం సిబ్బందికి ఇవ్వనున్నట్లు చెప్పారు. గతంలో ఉన్న ఏఎన్‌ఎల్ వారికి కాల పరిమితి పూర్తి కావడంతో సంస్థ ఈ నిర్ణయం తీసుకుందని వివరించారు. పచ్చి సరుకులు(పూలు, ఆకు కూరలు, కూరగాయలు)సైతం తక్కువ చార్జీలతో సులభంగా రవాణా చేసుకోవచ్చునన్నారు. ఇందుకు కిలోమీటరుకు బరువు ఆధారంగా చార్జీలు నిర్ణయించినట్లు చెప్పారు. బస్సు ఎక్కడ ఉన్నది సులభంగా తెలుసుకోవడానికి ప్రతి బస్సుకు జీపీఎస్‌ను అమర్చనున్నట్లు వివరించారు. త్వరలో కడప–రాజంపేట మార్గంలో ప్రయోగాత్మకంగా అల్ట్రా తెలుగు వెలుగు సర్వీసులు నడిపేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. వనితా కార్డులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డీఎం అజ్మతుల్లా, అసిస్టెంట్ డీఎం నాయక్, కార్మికులు, ప్రయాణికులు పాల్గొన్నారు.



పార్శిల్ సౌకర్యంపై ప్రయాణికులతో మాట్లాడుతున్న ఆర్‌ఎం చెంగల్ రెడ్డి

వేంపల్లె బస్టాండ్ పరిశీలన

వేంపల్లె : అనంతరం ఆయన వేంపల్లె వెళ్లారు. అక్కడి బస్టాండ్‌ను తనిఖీ చేశారు.పార్శిల్ సౌకర్యం నిర్వహించే ప్రత్యేక గదిని పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలు ఇచ్చారు. బస్టాండ్ ఆవరణంలో పార్కింగ్ స్థల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని డీఎంకు సూచించారు. రాయచోటి – వేంపల్లె మార్గంలో బస్సులను సక్రమంగా ఆపడంలేదని అసంతృప్తి వ్యక్తం చేసిన ఆర్‌ఎం బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రీజియన్ పరిధిలోని డిపోలతోపాటు వేంపల్లె, గాలివీడు, పోరుమామిళ్ల, ఎర్రగుంట్ల ప్రాంతాలలోని బస్టాండ్‌లలో గదుల ఏర్పాటుకు త్వరలో టెండర్లను పిలుస్తామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాయక్, కంట్రోలర్ రాజశేఖరరెడ్డి, మధుసూదన్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కోటిరెడ్డిసర్కిల్ : నగర శివార్లలోని రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ డాక్యుమెంటేషన్ కోసం అర్హులైన అభ్యర్థులు, సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రిమ్స్ సూపరింటెండెంట్ గిరిధర్ బుధవారం తెలిపారు. ఇతర వివరాలకు పర్యవేక్షకులు, రిమ్స్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి కడప కార్యాలయంలో వచ్చే నెల 6వతేదీలోగా సంప్రదించాలన్నారు.

5న ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు సన్మానం

వైవీయూ : విద్యారంగంలో ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు సైతం విశేష సేవలందించారని.. సెప్టెంబర్ 5న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని వారికీ అవార్డులు అందజేసి, సన్మానించనున్నట్లు జిల్లా మేధావి సమాఖ్య అధ్యక్షుడు ఎం.వివేకానందరెడ్డి పేర్కొన్నారు. బుధవారం పుష్పగిరి విద్యాసంస్థల్లో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన, ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఈ సందర్భంగా సన్మానించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు తమ వివరాలను పుష్పగిరి విద్యాసంస్థల చిరునామాకు పంపాలని కోరారు. పుష్పగిరి–ఎన్ రెడిఫ్ మెయిల్.కామ్‌కు మెయిల్ చేయవచ్చని తెలిపారు. ప్రభుత్వాలు సైతం ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సేవలను పరిగణలోకి తీసుకుని అవార్డులు అందజేయాలని కోరారు.

ఎన్టీఆర్ జలసిరికి నాబార్డు రుణసహాయం

కడప కార్పొరేషన్ : నాబార్డు గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి నిధి కార్యక్రమాల్లో భాగంగా ఎన్టీఆర్ జలసిరికి నాబార్డు ద్వారా రుణ సహాయం అందిస్తామని నాబార్డ్ ఏజీఎం బి. శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఎన్టీఆర్ జలసిరి ప్రాజెక్టు రెండో దశ నిర్మాణం కోసం రూ.116.51కోట్ల రుణం మంజూరు చేసిందన్నారు. ఈ ప్రాజక్టులో భాగంగా రాష్ట్రంలోని 12 జిల్లాలలో 18117 బోరు వాగుల తవ్వకం చేపడుతారన్నారు. ఈ బోరు బావుల నుంచి నీటిని పంప్ చేయడానికి సోలార్ పంప్ సెట్లను అమర్చడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమన్నారు. కడప జిల్లాలో 344 బోరు బావుల త్రవ్వకం, సోలార్ పంప్‌సెట్లను ఈ ప్రాజెక్టు ద్వారా అమర్చడం జరుగుతుందన్నారు. ఈ ప్రాజెక్టు వ్యయం రూ.301.69 లక్షలు కాగా ఇందులో నాబార్డు రుణం రూ.221.25లక్షలని తెలిపారు.

పోటీల్లో రాణించిన విద్యార్థులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : ప్రపంచ పర్యాటక దినోత్సవంలో భాగంగా ప్రభుత్వ పురుషుల కళాశాలలో బుధవారం పోస్టర్ పెయిటింగ్, పత్ర సమర్పణ అంశాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.సుబ్బనరసయ్య మాట్లాడుతూ పత్ర సమర్పణలో టి.సుజిత్, ఎం.సత్యనారాయణ హరికృష్ణ వరుసగా ప్రథమ,ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారన్నారు. పోస్టర్ పెయింటింగ్‌లో ఎం.సత్యనారాయణ, ఓబులమ్మ, ప్రవల్లిక ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారన్నారు. వీరిలో ప్రథమస్థానం పొందిన వారు విశ్వవిద్యాలయ స్థాయిలో పాల్గొనేందుకు అర్హత సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకురాలు నెల్లూరు శివపార్వతి, చరిత్ర విభాగం ఇన్‌ఛార్జి ఎం.రమేష్, తెలుగు విభాగాధిపతి సుందరేశ్వరరావు, విజయ్‌కుమార్, భారతి, రాజేశ్వరి, వైస్ పిన్సిపల్ రవికుమార్, చరిత్ర ఉర్దూ అధ్యాపకులు హబీబుల్లా తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల ఒప్పంద అధ్యాపకుల

రెన్యువల్ జీఓ విడుదల

వైవీయూ : రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న దాదాపు 3672 కాంట్రాక్ట్ అధ్యాపకులను రెన్యువల్ చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసిందని ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి ముగింపు తేదీ వరకు రెన్యువల్ చేస్తూ జీఓ నెం. 162 విడుదల చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఒప్పంద అధ్యాపకులకు కల్పిస్తున్న విధంగా ఉద్యోగభద్రత, వేతనం పెంచాలని కోరారు.

తిరుమల సమాచారం

తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ తక్కువగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 12 కంపార్టుమెంట్లు నిండాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం:

గదుల వివరాలు:

ఉచిత గదులు – ఖాళీ లేవు
రూ.50 గదులు – ఖాళీ లేవు
రూ.100 గదులు – ఖాళీ లేవు
రూ.500 గదులు – ఖాళీ లేవు

సేవలు

సహస్రదీపాలంకరణ సేవ – 250 ఖాళీ ఉన్నాయి
వసంతోత్సవం – 150 ఖాళీ ఉన్నాయి
ఆర్జిత బ్రహ్మోత్సవం– 200 ఖాళీ ఉన్నాయి

గురువారం ప్రత్యేక సేవ : తిరుప్పావడ

వాతావరణం

రానున్న 24 గంటల్లో సౌరాష్ట్ర, కచ్, ఉత్తరాఖండ్, ఈశాన్య రాష్ట్రాలు, ఉత్తర పశ్చిమ బెంగాల్, పశ్చిమ తీర ప్రాంతాల్లో మధ్యస్థం నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో మిగిలిన ప్రాంతాల్లో, జార్ఖండ్, బిహార్, ఉత్తర ప్రదేశ్ పర్వతాలకు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో, ఉత్తర ప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, హరియాణా, పంజాబ్‌లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడతాయి.

వైఎస్‌ఆర్ జిల్లా వాతావరణం

గరిష్టం కనిష్టం
34.8°/26.0°

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	35.5	27.6
కోల్‌కతా	35.2	26.0
బెంగళూరు	28.5	31.1
ముంబై	30.5	23.1
చెన్నై	36.1	25.5

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట
నెల్లూరు	36.8/27.0	కాకినాడ	33.8/24.0
ఒంగోలు	36.6/26.0	ఖమ్మం	33.0/20.0
చిత్తూరు	36.5/26.0	విశాఖపట్నం	32.7/24.6
తిరుపతి	36.5/26.0	శ్రీకాకుళం	32.6/26.5
అనంతపురం	35.0/25.0	విజయనగరం	32.6/26.5
విజయవాడ	35.0/24.6	నల్లగొండ	32.6/24.0
కడప	34.8/26.0	ఆదిలాబాద్	32.6/21.0
గుంటూరు	34.8/24.0	హైదరాబాద్	32.0/22.3
కర్నూలు	34.6/25.0	రంగారెడ్డి	32.0/22.3
కరీంనగర్	34.2/25.2	నిజామాబాద్	31.9/24.0
ఏలూరు	34.0/25.6	మెదక్	31.7/21.6
రాజమండ్రి	34.0/25.6	వరంగల్	31.6/24.5
తాడేపల్లిగూడెం	34.0/25.6	మహబూబ్‌నగర్	31.4/23.0

బుల్లితెర

W

సాక్షి SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30 నిరీక్షణ
ఉ.07.00 న్యూస్ 360
ఉ.07.30 కేఎస్ఆర్ లైవ్ షో
ఉ.09.00 రీజనల్ న్యూస్
ఉ.09.30 మ్యాగజీన్ స్టోరీ
ఉ.10.30 స్క్రీన్‌ప్లే
ఉ.11.30 పొలిటికల్ కారిడార్
మ.02.30 డాక్టర్స్ టైమ్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
రా.07.30 పొలిటికల్ కారిడార్
రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
రా.09.00 న్యూస్ 360
రా.09.30 మ్యాగజీన్ స్టోరీ
రా.10.30 స్క్రీన్‌ప్లే
రా.11.30 న్యూస్ ఫీచర్

టీవీలో ఈరోజు సినిమాలు




జెమిని మూవీస్
ఉ.07.00 గూఢచారి 117
ఉ.09.30 శేషాద్రి నాయుడు
మ.12.00 పోస్ట్‌మ్యాన్
మ.03.00 శ్రీమతీ వెళ్లొస్తా
సా.06.00 ఆంధ్రుడు




మూవీస్ నౌ
ఉ.08.20 స్పిసిస్
ఉ.10.20 క్లిఫ్ హ్యాంగర్
మ.02.45 రష్ అవర్ 3
సా.05.55 సూపర్‌మాన్ రిటర్న్స్
రా.09.00 టాయ్ స్టోరీ




హెచ్‌బీవో
ఉ.08.09 ఘోస్ట్ షిప్
ఉ.09.42 ఫూల్స్ గుడ్
ఉ.11.38 కుంగ్‌ఫు పాండా 2
సా.05.10 ఐపీ మ్యాన్ 3
రా.07.00 ద అకౌంటెంట్



సోనీ పిక్స్
ఉ.0626 సెంటర్ స్టేజ్
ఉ.11.26 బ్యాటిల్‌షిప్
మ.01.47 ద ఇంక్రెడిబుల్ హల్క్
సా.06.13 వాటర్‌వరల్డ్
రా.09.00 జురాసిక్ పార్క్



మా మూవీస్
ఉ.07.00 పెద్దోడు చిన్నోడు
ఉ.09.00 ఆనంద్
మ.12.00 షాక్
మ.03.00 ఎందుకంటే ప్రేమంట
సా.05.00 సింగం



జీ సినిమా
ఉ.07.50 ఆవారా పాగల్ దీవానా
ఉ.10.54 ఐ
మ.02.42 సిర్ఫ్ తుమ్
సా.05.41 హసీనా మాన్ జాయేగీ
రా.09.00 నామ్ షబానా


కీ॥శే॥ యం.యం. పరమశివన్
యం.పి.గిరిజశివన్
కీ॥శే॥ యం.యం.పరమశివన్ గారు
వాణిజ్య పన్నుల శాఖ ఆంధ్రప్రదేశ్‌లో రాయలసీమ జోన్ నందు
1960-80 దశకాలల్లో తమ మహోన్నత వ్యక్తిత్వంతో
డిపార్టుమెంటుకు సేవలందించి డీలర్లకు ప్రీతిపాత్రులుగా వున్నారు.
పదవీ విరమణ శుభాకాంక్షలు
వీరి వారసత్వాన్ని కొనసాగిస్తూ వీరి ఆశీస్సులతో కుమారుడు
శ్రీ యం.పి. కేశవ కుమార్ గారు
డిప్యూటి అసిస్టెంట్ కమీషనర్‌గా ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పన్నుల శాఖలో
విశిష్ట సేవలందించి, ఉన్నతాధికారుల మనసును చూరగొని
అటు డిపార్టుమెంటనకు, ఇటు కుటుంబానికి సమ ప్రాధాన్యత ఇచ్చిన
మనసున్న మారాజు నేడు పదవీ విరమణ చేయు సందర్భంగా వారి
శేష జీవితం ఆయురారోగ్యాలతో తులతూగాలని ఆశిస్తూ సకుటుంబ
సపరివార సమేతంగా ఇవే మా హార్థిక శుభాకాంక్షలు...
కుటుంబ సభ్యులు
Sri Kesava Kumar M.P.
Deputy Asst. Commisioner (SalesTax), KADAPA.
Smt M.K.Aruna Devi
తమ్ముడు ఫ్యామిలి
యం.ఎస్.మురుగేశం D.E.E
శ్రీమతి మంజుల దేవి
యం.యం.శ్రీవల్లి B.Sc
యం.యం.గేణేష్ కుమార్, M.Tech (U.S.A)
యం.యం.రూపేష్ కుమార్, B.Tech
తమ్ముడు ఫ్యామిలి
యం.పి. శివప్రసాద్ D.C.T.O
శ్రీమతి యం.ఎస్.శ్రీదేవి
యం.ఎస్.త్రిశాల (MBBS)
యం.ఎస్.త్రివేద
చెల్లెలు ఫ్యామిలి
శ్రీమతి ఆర్.భ్రమరాంబ
W/o. ఐ.రాజా
IPS. ADGP (Rtd)
Tamilanadu
ఆర్.శివకాంత్
అక్క ఫ్యామిలి
శ్రీమతి కె.శారద
W/o. పి.కాళిముత్తు
IPS. DGP (Rtd)
Tamilanadu
కె.ఆనంద్ & దీప
కె.అరవింద్ & దీప
చెల్లెలు ఫ్యామిలి
శ్రీమతి ఆర్.విజయలక్ష్మి
W/o. ఎన్.రమేష్‌బాబు
IPS; ADGP
West Bengal
శ్రీమతి ఆర్.ధనలక్ష్మి
W/o. సుగుణాసింగ్
IPS; DCP
Thirunalveli, T.N.
ఆర్. దాక్షాయణి
చెల్లెలు ఫ్యామిలి
శ్రీమతి పద్మావతి
W/o. ఎ.ఎస్.జీవరత్నం
IAS (Rtd), Secretary, Tamilanadu
శ్రీమతి జె.పవిత్ర
W/o. జె.జావిద్
కుమార్తె ఫ్యామిలి
శ్రీమతి జి.మానస
W/o. జి.ఉదయ్ భాస్కర్ రావు
Junior Civil Judge
T.S., Hyd.
జి.ఆరవ్
కుమారుడు
యం.కె.శివబ్రహ్మ B.Tech
కుమార్తె
యం.కె.వైష్ణవి MBA
కుమార్తె ఫ్యామిలి
శ్రీమతి డా॥ సౌగంధి W/o. డా॥ ఏకాంక్ష్ జైన్, M.D. Hyd .T.S.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

విజేతగా నిలిచిన ప్రొద్దుటూరులోని చౌటపల్లె వృషభాలు



మొదటి బహుమతిని కైవసం చేసుకున్న చౌటపల్లెకు చెందిన మార్తల చంద్రఓబుల్‌రెడ్డి ఎద్దులు

బద్వేలు అర్బన్ : వినాయకచవితి సందర్భంగా స్థానిక సిద్దవటంరోడ్డులోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ కమిటీ, వరసిద్ది వినాయక ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సీనియర్ విభాగం బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీలకు కడప, కర్నూలు జిల్లాలకు చెందిన ఆరు జతల ఎద్దులు పాల్గొన్నాయి. ఇందులో ప్రొద్దుటూరుకు సమీపంలో ఉన్న చౌటపల్లె గ్రామానికి చెందిన మార్తల చంద్ర ఓబుల్‌రెడ్డి ఎద్దు 1336.9 అడుగులు బండలాగి మొదటిస్థానంలో నిలిచాయి. ప్రొద్దుటూరుకు సమీపంలోని రాజుపాలెం మండలం వెలవలి గ్రామానికి చెందిన కసునూరువుస్సేన్‌పీరాకు చెందిన వృషభాలు 1261 అడుగులు బండలాగి రెండో స్థానంలో నిలిచాయి. కర్నూలుజిల్లా డోన్‌కు సమీపంలోని కొత్తకోట గ్రామానికి చెందిన డాక్టర్ గురునాథ్‌కు చెందిన ఎద్దు 1254.4 అడుగులు బండలాగి మూడో స్థానంలో, కసునూరువుస్సేన్‌పీరాకు చెందిన మరో జత ఎద్దు 1229.9 అడుగులు బండలాగి నాల్గవస్థానంలో నిలిచాయి. విజేతలకు మొదటి బహుమతిగా రూ.50,116 సంగ్రా శ్రీనివాసయాదవ్ అందించగా, రెండో బహుమతి రూ.35,116 పల్లెపల్లెరెడ్డి, మూడో బహుమతి రూ.20,116 గాజులపల్లెవెంకటరమణారెడ్డి, నాలుగో బహుమతి రూ.10,116లు దేవిరెడ్డిగోపాల్‌రెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమాలకు అడ్డుకట్ట

- మధ్యాహ్న భోజన వివరాల నమోదుకు స్మార్ట్‌ఫోన్ తప్పనిసరి
- ఏపీ ఎండీఎం అటెండెన్స్ పేరుతో యాప్

బద్వేలు :

మధ్యాహ్న భోజన విధానంలో లోపాలు ఉండటం, ప్రభుత్వం మంజూరు చేసిన బియ్యాన్ని ఎక్కువ హాజరు వేసి అక్రమాలకు పాల్పడటం మామూలే. కానీ సాంకేతికతను ఉపయోగించుకుని అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ పథకాన్ని మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు, క్షేత్ర స్థాయిలో లోపాలను సవరించడానికి విద్యాశాఖ అధికారులు ఏపీ ఎండీఎం(మిడ్ డే మీల్స్) పేరుతో ఒక యాప్‌ను రూపొందించారు. దీంతో పాటు ఆయా నెలల్లో పాఠశాలలకు కేటాయించిన బియ్యం సమాచారాన్ని తెలుసుకునేందుకు వెబ్ పోర్టల్‌నే ఏర్పాటు చేసి దాన్ని యాప్‌తో అనుసంధానించారు.



బద్వేలు బాలుర పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

యాప్‌లో విద్యార్థుల సంఖ్య నమోదు

ఇప్పటి వరకు హెచ్‌ఎంలు ప్రతి రోజు హాజరైన విద్యార్థుల వివరాలను తమ సెల్‌ఫోన్ నుంచి ఎసెమ్మెస్ ద్వారా ఉన్నతాధికారులకు ఉదయం 11 గంటలలోపు ఈ వివరాలను పంపేవారు. హెచ్‌ఎంలు సెలవు పెట్టినప్పుడు, నెట్‌వర్కు పని చేయని సమయంలో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడేవారు. ఎసెమ్మెస్ పంపని రోజుకు బిల్లుల చెల్లింపులు నిలిచిపోయేవి. దీంతో ఏజెన్సీల వారు కొన్ని ప్రాంతాల్లో అవస్థలు పడేవారు. ఈ లోపాన్ని అధిగమించేందుకు యాప్‌ను రూపొందించినట్లు విద్యా శాఖ అధికారులు చెబుతున్నారు. యాప్‌తో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు, మధ్యాహ్న భోజనం చేసిన విద్యార్థుల సంఖ్య వంటి సమాచారాన్ని క్షణాల్లో తెలుసుకోవచ్చు. సెప్టెంబరు ఒకటి నుంచి మధ్యాహ్న భోజనానికి వచ్చిన విద్యార్థుల సంఖ్యను నమోదు చేయకుంటే ఆరోజుకు సంబంధించిన బిల్లులు రద్దు అవుతాయి. యాప్ వినియోగంతో క్షేత్ర స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు అవకతవకలకు చోటు ఉండదు. గతంలో నెలవారీ నివేదికల ఆధారంగా ఏజెన్సీలకు బిల్లులు అందించేవారు. అనేక పాఠశాలల్లో హాజరు శాతం ఎంత ఉంటే అంతమందిని చూపి గైర్హాజరైన వారికి కూడా బిల్లులు చేసుకునేవారు. నెలకొకసారి నివేదిక అందజేస్తుండటంతో మధ్యలో వీటిలో మార్పులు చేర్పులు చేసి ఏజెన్సీలకు అనుకూలంగా వ్యవహరించేవారు. ఇవనీ తనిఖీల్లో వెల్లడైన విషయం తెలిసిందే. దీనిని నివారించేందుకు గతేడాది సెప్టెంబరు నుంచి ఎసెమ్మెస్ విధానాన్ని ప్రవేశపెట్టారు. ప్రస్తుతం మరింత సాంకేతికతతో యాప్‌ను ప్రవేశపెట్టారు.

గూగుల్ ప్లేస్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. మధ్యాహ్న భోజన పథకం అని తెలుగులో ముఖచిత్రం కనిపిస్తుంది. యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నాక స్క్రీన్‌పై పాఠశాల యూ డైస్ కోడ్‌ను నమోదు చేయాలి. రెండో కాలంలో పాస్‌వర్డు ఉంటుంది. అక్కడ రాష్ట్రంలోని ఏ పాఠశాల వారైనా 123 పాస్‌వర్డుతో లాగిన్ కావచ్చు. అనంతరం పాఠశాల పేరుతో పాటు తరగతి, విద్యార్థుల హాజరు, ఆ రోజు మధ్యాహ్న భోజనం చేసిన వారి సంఖ్యను నమోదు చేయాలి. ఈ వివరాలు వెంటనే రాష్ట్రస్థాయి అధికారులకు చేరతాయి.

బియ్యం వివరాలు తెలుసుకోవచ్చు

యాప్‌ద్వారా ఎండీఎం పథకానికి ఆయా నెలల్లో ఏయే పాఠశాలలకు ఎంత మొత్తంలో బియ్యాన్ని కేటాయించారో తెలుసుకోవచ్చు. హెచ్‌ఎంలు తెలుసుకునేలా పౌరసరఫరాల శాఖ అధికారులకు సంబంధించిన వెబ్‌పోర్టల్ కు అనుసంధానించారు. ఎస్సీఎం ఎఫ్‌పీ ఎస్ స్టేటస్ పేరుతో ఈ వెబ్‌పోర్టల్ అందుబాటులో ఉంటుంది. జిల్లా, మండలం, రేషన్ షాపు నెంబరును నమోదు చేసి ఏ నెలలో ఎన్ని బియ్యం మంజూరయ్యాయనే విషయాన్ని హెచ్‌ఎంలు సులువుగా తెలుసుకోవచ్చు.

ఐఏబీలో సీబీఆర్‌కు నీటి కేటాయింపులు

లింగాల :

తుంగభద్ర జలాశయం నుంచి సీబీఆర్‌కు నీటి కేటాయింపుల కోసం అనంతపురం జిల్లా కేంద్రంలో బుధవారం ఐఏబీ సమావేశం నిర్వహించారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు 3.77టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు సమావేశం ఆమోదం తెలిపింది. దీంతో బుధవారం సాయంత్రం తుంగభద్రా నుంచి మిడ్ పెన్నార్‌కు సీబీఆర్‌కు నీటిని విడుదల చేశారు. మిడ్ పెన్నార్ నుంచి తుంపెర ద్వారా సీబీఆర్‌కు చేరడానికి మరో 10, 15రోజుల సమయం పడుతుందని పీబీసీ అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అవినాష్‌రెడ్డి పాల్గొన్నారు.

మంచం పట్టిన చింతరాజుపల్లె

- విజృంభించిన జ్వరాలు.
- గ్రామాన్ని సందర్శించిన డీఎంఅండ్‌హెచ్‌ఓ

ఒంటిమిట్ట(రాజంపేట) : అటవీ గ్రామమైన చింతరాజుపల్లె గ్రామంలో జ్వరాలు విజృంభించాయి. అపరిశుభ్రతతో దోమలు పెరిగాయి. పల్లెజనం మంచం పట్టేలా చేశాయి. ప్రతి ఇంటిలోను జ్వరపీడితులు ఉన్నారు. మెరుగైన చికిత్స కోసం ఒంటిమిట్ట, కడప ప్రాంతాలకు వెళుతున్నారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ రామిరెడ్డి బుధవారం చింతరాజుపల్లె గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో దోమ లార్వా వృద్ధి చెంది దోమలు అధికంగా ఉత్పత్తి అవుతాయన్నారు. జ్వరంతో బాధపడుతున్నవారు రక్త పరీక్ష చేయించుకోవాలన్నారు. రెండురోజుల పాటు వైద్యసిబ్బంది గ్రామంలో అందుబాటులో ఉండాలన్నారు. రాజంపేట డీఎల్‌పీఓ రమణ మాట్లాడుతూ ఇళ్ల ముందు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని చెప్పారు.



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

ఒంటిమిట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో చింతరాజుపల్లెలో వైద్యశిబిరం నిర్వహించారు. ప్రతి ఒక్కరి నుంచి రక్తనమూనాలు సేకరించారు. డా.రాజశేఖర్ రోగులకు చికిత్స అందించారు.కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి రాజశేఖర్, ఈవోపీఆర్‌డీ సుబ్బరాయుడు, పంచాయతీ కార్యదర్శి రమణారెడ్డి, పీహెచ్‌సీ వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రి తనిఖీ



సూపరింటెండెంట్ లక్ష్మీప్రసాద్‌తో మాట్లాడుతున్న డాక్టర్ ఉమాదేవి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిని వైద్య, ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్, రాష్ట్ర పరిశీలకురాలు డాక్టర్ ఉమాదేవి బుధవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని డయాలసిస్, సిటీ స్కాన్, ఎక్స్‌రే విభాగాలు, ఓపీ నిర్వహణ తీరు, తల్లి బిడ్డ, కాన్పుల వార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో అమలు అవుతున్న పలు పథకాలను గురించి సూపరింటెండెంట్ లక్ష్మీప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల ఆపరేషన్లు బాగా పెరిగాయని, ఓపీ కూడా గతంలో కూడా పెరిగినట్లు డాక్టర్ ఉమాదేవి తెలిపారు. ఈ ప్రాంతంలోని దాతల సహకారం బాగుండటంతో ఆస్పత్రిలో కొన్ని సౌకర్యాలు సమకూరాయని తెలిపారు. అనంతరం ఆమె పట్టణంలోని ముఖ్యమంత్రి ఆరోగ్యకేంద్రాలను పరిశీలించారు.

నడుస్తూ...నడిపిస్తూ..

- లక్కిరెడ్డిపల్లె మండలంలో కలెక్టర్ విస్తృత పర్యటన
- ప్రజలతో మమేకం.. సమస్యలపై ఆరా
- పలుశాఖల అధికారులపై మండిపాటు
- ప్రజలనుంచి వెల్లువెత్తిన వినతులు



గ్రామస్తులతో కలిసి నీళ్లలో నడుచుకుంటూ వెళుతున్న కలెక్టర్



పాలెంగొల్లపల్లె హరిజనవాడలో ప్రజలతో మాట్లాడుతున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని పాళెంగొల్లపల్లె, బురుజుపల్లె, హరిజనవాడ, చిన్నపోతులవాండ్లపల్లె గ్రామాల్లో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం 11 వరకు కలెక్టర్ పర్యటించారు. ప్రజలతో మమేకమై సమస్యలపై ఆరా తీశారు.పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా ఆయన గ్రామాలను సందర్శించారు. కలెక్టర్ వచ్చారని తెలుసుకున్న మండల స్థాయి అధికారులు రాత్రికి రాత్రే వారి వాహనాల్లో ఉరుకులు,పరుగులు పెట్టారు. జోరువానలో కూడా ప్రతి మహిళను, విద్యార్థులను పలకరిస్తూ పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.డ్వాక్రా రుణాలు అందించడంలో అలసత్వం వహించిన సీసీపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.మండల రెవెన్యూ అధికారిని ఆ గ్రామం పేరు అడగ్గా కోనంపేట అని సమాధానం ఇవ్వడంతో మండలానికి వచ్చి సంవత్సరాలు గడుస్తుంటే నీకు ఊరు పేర్లు కూడా తెలియకపోవడం బాధాకరమన్నారు. వీఆర్ఓ,వీఆర్ఏలను పిలిచి మీ రాజకీయాలు ఇక్కడ పనికిరావని రెవెన్యూ సమస్యలపై దృష్టి పెట్టకపోతే ఇంటికి పోవాల్సి వస్తుందన్నారు. పాళెంగొల్లపల్లె గ్రామస్తులు గ్రామంలో గుడి కట్టించాలని కోరగా ప్రతి ఇంటికి మరుగుదొడ్డిని నిర్మించుకొంటే గుడి నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. బస్సు సౌకర్యం కల్పించాలని నల్లగుట్టపల్లె, పాళెంగొల్లపల్లె వాసులు కలెక్టర్‌ను కోరారు.గ్రామాల్లో తాగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పాళెంగొల్లపల్లె కస్పా సమీపంలోని మామిడితోటలో తవ్విన ఫాంపాండ్స్ పనులను పరిశీలించారు. కొందరు గ్రామస్తులు కలెక్టర్‌తో మాట్లాడారు. చెంచెర్లపల్లె మాలపల్లెకు ఏళ్ల తరబడి రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దారి సౌకర్యం కల్పించాలన్నారు..కోనంపేట పీహెచ్‌సీని లక్షలు వెచ్చించి నిర్మించినా సిబ్బంది,పరికరాలు అందుబాటులో లేవన్నారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ రంగారెడ్డితో ఫోన్‌లో మాట్లాడి రోగులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యులు స్థానికంగా లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సివస్తోందని ఆయనకు తెలియజేశారు. వారానికి ఒక్క రోజు మండల స్థాయి అధికారులు గ్రామాల్లో ఉండాలని ఆదేశించారు. తహసీల్దార్ దేవలానాయక్,ఎంపీడీఓ రవికుమార్ రెడ్డి,హెచ్‌ఓ చందన,ఏపీఓ సుధారాణి,ఏఓ వెంకట్రమణారెడ్డి,ఏపీఎం శ్రీనివాసులు రెడ్డి,ఈఓపీఆర్‌డీ ప్రతాప్ రెడ్డి, హౌసింగ్ ఏఈ రెడ్డెయ్య,ప్లాంటేషన్ సూపర్‌వైజర్ ఆనంద్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

నవరత్నాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి


ప్రసంగిస్తున్న మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి


నవరత్నాల సభకు హాజరైన నాయకులు

- రాజన్న రాజ్యం కోసం కలిసి కట్టుగా శ్రమిద్దాం
- మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి పిలుపు

కడప కార్పొరేషన్ :

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్లీనరీలో ప్రకటించిన నవరత్నాల్లాంటి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మాజీ మంత్రి, వైఎస్ఆర్‌సీపీ జిల్లా సమన్వయకర్త వైఎస్ వివేకానందరెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఆదిత్య కళ్యాణ మండపంలో నిర్వహించిన నవరత్నాల సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 2019 ఎన్నికల్లో రాజన్న రాజ్యం తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ అంకిత భావంతో కృషి చేయాలన్నారు. రాష్ట్రంలోని 175 అసెంబ్లీ స్థానాలకుగాను మెజార్టీ స్థానాలను కైవసం చేసుకుంటే కేంద్రంతో పోరాడి ప్రత్యేక హోదా సాధించవచ్చన్నారు. జిల్లాకు భారీ ఉక్కు కర్మాగారం తెచ్చుకుంటే వేలాదిమందికి ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. అలాగే జిల్లాలో పెండింగులో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసుకుని రైతాంగాన్ని ఆదుకోవాల్సిన అవసరముందని తెలిపారు. పేద ప్రజలు సుభిక్షంగా జీవించేలా ప్రణాళిక తయారు కావాలంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.

అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ఆర్ మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించి, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు చేశారని గుర్తు చేశారు. వైఎస్ జగన్ ప్రకటించిన నవరత్నాల్లాంటి పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో రుణమాఫీ చేస్తానని ఒక్క అబద్ధం ఆడి ఉంటే వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యేవారన్నారు. నంద్యాల ఉప ఎన్నికల్లో గెలిచి టీడీపీ నాయకులు చంకలు గుద్దుకుంటున్నారని, రూ.250కోట్లు ఖర్చు పెట్టి గెలిచింది కూడా ఒక గెలుపేనా అని ప్రశ్నించారు. 52 ఉప ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ప్రాణం ఉన్నంతవరకూ వైఎస్ జగన్‌వెంటే – అంజద్‌బాషా

తన ప్రాణం ఉన్నంతవరకూ వైఎస్ జగన్ వెంటే ఉంటానని కడప శాసనసభ్యులు ఎస్ బీ అంజద్‌బాషా స్పష్టం చేశారు. తాను పార్టీ మారుతున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు రావడంపై ఆయన పైవిధంగా స్పందించారు. రాష్ట్రంలో దుర్మార్గమైన ప్రజా వ్యతిరేక పాలన సాగుతోందని ధ్వజమెత్తారు. చంద్రబాబు సీఎం అయ్యాక ఆయన కుమారుడు లోకేష్‌కు మాత్రమే అడ్డదారిలో ఉద్యోగం వచ్చిందని, రాష్ట్రంలోని నిరుద్యోగులెవ్వరికీ రాలేదని ఎద్దేవా చేశారు.

అంతకుముందు వైఎస్ఆర్ విగ్రహానికి నివాళి అర్పించి, పార్టీ నాయకులు జీఎన్ఎస్ మూర్తి, కొండమ్మల మృతికి సభ సంతాపం ప్రకటించింది. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ సీపీ రాష్ట్రకార్యదర్శులు తుమ్మలకుంట శివ శంకర్, గౌసులాజం, నగర అధ్యక్షుడు బి. నిత్యానందరెడ్డి, నాయకులు బీహెచ్ ఇలియాస్, బోలా పద్మావతి, పాకా సురేష్, చల్లా రాజశేఖర్, బంగారు నాగయ్య, పులి సునీల్, కరిముల్లా, వేణుగోపాల్ నాయక్, షఫీ పాల్గొన్నారు.

ఒక చేత్తో తీసుకొని మరో చేత్తో ఇస్తున్నారు - ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల సొమ్మును ఒక చేత్తో తీసుకొని, మరో చేత్తో ఇస్తున్నారని కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. మూడున్నరేళ్లుగా రైతులకు ప్రభుత్వం వడ్డీలేని రుణాలు, పావలా వడ్డీరుణాలు ఇవ్వలేదన్నారు. అలా ఇవ్వాలంటే 50వేల కోట్ల రుణాలకు ఏటా 4 శాతం అనగా రెండువేల కోట్లు బ్యాంకులకు చెల్లించాలని, మూడేళ్లకు 6వేల కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. కానీ ప్రభుత్వం ఆ డబ్బును రుణమాఫీ అని చెబుతూ రైతాంగాన్ని వంచిస్తోందని ధ్వజమెత్తారు. 2013–14కు సంబంధించి రూ.2300 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ రావాల్సి ఉంటే దాన్నికూడా రుణమాఫీ కింద జమ చేశారని ఆరోపించారు. ఆరోగ్యశ్రీలో క్యాన్సర్, కిడ్నీ బాధితులకు రూ.2లక్షల వరకే పరిమితి విధించడం వల్ల రోగుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ప్రస్తుత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.35వేలు మాత్రమే ఇస్తోందని, హాస్టల్, మెస్ చార్జీలు తల్లిదండ్రులే భరించాల్సి వస్తోందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తిగా ఇచ్చేందుకు వైఎస్ఆర్‌సీపీ కృషి చేస్తుందని తెలిపారు.

సెప్టెంబర్ 7 నుంచి పూర్తి స్థాయిలో బయోమెట్రిక్!

బయోమెట్రిక్‌పై డీసీఈబీలో హెచ్‌ఎంలకు అవగాహన సదస్సు




మాట్లాడుతున్న అధికారి దేవరాజ్ , హాజరైన ప్రధానోపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో సెప్టెంబర్ 7వ తేదీ నాటికి అన్ని పాఠశాలల్లో బయోమెట్రిక్‌ను కచ్చితంగా అమలు చేయాలని బయోమెట్రిక్ రాష్ట్ర నోడల్ అధికారి దేవరాజ్ ఆదేశించారు. కడపలోని డీసీఈబీలో బుధవారం కడప డివిజన్‌లోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు బయోమెట్రిక్ అమలు యంత్రాల నిర్వాహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బయోమెట్రిక్ అమలు కోసం ఈనెల 28 నుంచి సెప్టెంబర్ 7 వరకూ ప్రభుత్వం షెడ్యూల్‌ను ప్రకటించిందన్నారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 2 వరకూ డివైస్‌ల పని తీరు, డేటా అప్‌లోడ్‌ను పరిశీలిస్తామని, 4 నుంచి 6 వరకూ పని చేయనివాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తామన్నారు. 7 నుంచి అన్ని పాఠశాలల్లో బయోమెట్రిక్ పక్కాగా అమలు జరగాలన్నారు. ఇందులో ఎలాంటి మార్పులు లేదన్నారు. డిప్యూటీ ఈఓ జిలానీ బాషా మాట్లాడుతూ బయోమెట్రిక్ గురించి సాంకేతిక సమస్యలేవైనా ఉంటే 6వ తేదీనాటికి సరి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార సాంకేతిక రాష్ట్ర రీసోర్సు పర్సన్ శ్రీనివాసులు, ఆర్ ఎంఓస్‌ఏ ఏఎస్‌ఓ గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయుల ప్రమోషన్లు ఏమయ్యాయ్ !

- డీఈఓతో ఏపీ గిల్డ్ టీచర్స్ వాగ్వాదం
- అప్రూవల్స్ జరగకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరిక

కడప ఎడ్యుకేషన్ :

ఎయిడెడ్ ఉపాధ్యాయుల ప్రమోషనపై ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసి ఒకటిన్నర నెలైనా డీఈఓ కార్యాలయ సిబ్బంది ఇంతవరకూ పట్టించుకోకపోవడం విచారకరమని ఏపీ టీచర్స్ గిల్డ్ రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ నరసారెడ్డి, జిల్లా అధ్యక్షుడు బాలశౌరీరెడ్డి, జనరల్ సెక్రటరీ సుధాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎయిడెడ్ ఉపాధ్యాయుల ప్రమోషన్లను త్వరగా చేపట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం డీఈఓ శైలజకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు డీఈఓతో మాట్లాడుతూ కొన్ని రోజుల్లో చాలా మంది ఉద్యోగ విరమణ చేస్తారని అలా జరిగితే వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఎయిడెడ్ పాఠశాలల్లో పోస్టుల భర్తీకి సంబంధించిన ఫైల్‌ను త్వరగా పూర్తి చేసిన కార్యాలయ సిబ్బంది పదోన్నతుల ఫైల్ గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ ఫైల్ గురించి అడిగితే ఇక్కడి సిబ్బంది డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. కాగా ఓ దశలో డీఈఓ, గిల్డ్ టీచర్స్ నాయకుల మధ్య తీవ్రస్థాయిలో వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. సెప్టెంబర్ 4వ తేదీనాటికి ప్రమోషన్ అప్రూవల్స్ జరగకుంటే ఆందోళన చేస్తామని టీచర్స్ నాయకులు హెచ్చరించారు. దీనికి స్పందించిన డీఈఓ వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు.


డీఈఓతో వాగ్వాదం చేస్తున్న ఉపాధ్యాయ నాయకులు

పదోన్నతుల ప్రక్రియ చేపట్టండి

ఎయిడెడ్ ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను వెంటనే చేపట్టాలని ఏపీ టీచర్స్ గిల్డ్ రాష్ట్ర నాయకులు నరసారెడ్డి, జిల్లా నాయకులు బాలశౌరిరెడ్డి, సుధాకర్ డిమాండ్ చేశారు. సంబంధిత విషయమై కలెక్టర్ బాబురావునాయుడును బుధవారం కలిసి వినతిపత్రం ఇచ్చారు. చాలామంది ఉద్యోగ విరమణ పొందనున్నారని తక్షణం పదోన్నతులను చేపడితే వారికి న్యాయం జరగుతుందని విన్నవించారు.

మిలియన్ మార్చ్‌కి తరలిరండి

కడప సెవెన్‌రోడ్స్ : కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం విజయవాడలో నిర్వహించనున్న మిలియన్ మార్చ్ కార్యక్రమానికి జిల్లాలోని గ్రామ రెవెన్యూ అధికారులు తరలిరావాలని సీపీఎస్ రద్దు రాష్ట్ర కమిటీ కో–కన్వీనర్ టీసీ నాని పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక రెవెన్యూ హోంలో వీఆర్వోలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్ పరిధిలోని వీఆర్వోలంతా మిలియన్ మార్చ్‌కి రావాలన్నారు. రాష్ట్రంలో సీపీఎస్ పరిధిలో ఉన్న లక్షా 87 వేల ఉద్యోగుల కుటుంబాలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయన్నారు. ఈ పోరాటాన్ని ఏపీ వీఆర్వోల అసోసియేషన్ బలపరుస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో వీఆర్వోల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆర్. హుసేన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి బి.సుధాకర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరి సాగులో సస్యరక్షణే కీలకం

కడప అగ్రికల్చర్ : వరిసాగులో సస్యరక్షణే కీలకమని జిల్లా వ్యవసాయశాఖ జేడీ ఠాకూర్‌నాయక్ అన్నారు. బుధవారం సాయంత్రం నగరంలోని కడప వ్యవసాయ డివిజన్ కార్యాలయంలో ఉక్కాయపల్లె చంద్రన్న రైతు క్షేత్రాల కింద రైతులకు సూక్ష్మపోషకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ రైతులు పంట దిగుబడులు పెంచుకోవడానికి పెద్దగా కష్టపడాల్సిన అవసరం లేదని, చిన్న చిన్న మెళకువలు పాటిస్తే సరిపోతుందన్నారు. దీంతోపాటు పలు సూచనలు చేశారు.

కోరుకొండ బుచ్చిరాజుకు జానమద్ది పురస్కారం

కడప కల్చరల్ : విశాఖ జిల్లా అనకాపల్లిలోని శ్రీ శారద గ్రంథాలయ నిర్వాహకులు, గ్రంథాలయ బంధు కోరుకొండ బుచ్చిరాజుకు బ్రౌన్ గ్రంథాలయ వ్యవస్థాపకులు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి స్మారక సాహిత్య పురస్కారాన్ని అందజేయనున్నామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, జానమద్ది సాహితీపీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 22న బ్రౌన్ గ్రంథాలయంలో నిర్వహించనున్న సభలో ఆయనకు పురస్కారం కింద రూ.10 వేల నగదు, జ్ఞాపికతో సత్కారం చేయనున్నామని వివరించారు. బుచ్చిరాజు రాష్ట్రంలో అందరికీ సుపరిచితులని, ఆయనకు ఈ అవార్డు అందజేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామని వారు తెలిపారు.

నిరుపేదల ఆర్థికాభివృద్ధికే జేఎల్‌జీలు

కడప అగ్రికల్చర్ : నిరుపేదల కుటుంబాలకు ఆర్థిక చేయూతనిచ్చి వారిని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి జేఎల్‌జీల (జాయింట్ లయోబిలిటీ గ్రూప్స్) ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు తమ వంతు కృషి చేయాలని జిల్లా కో–ఆపరేటివ్ డిప్యూటీ రిజిస్ట్రార్ గుర్రప్ప కోరారు. బుధవారం నగరంలోని లీడ్ బ్యాంకు కార్యాలయంలో జేఎల్‌జీల ఏర్పాటుపై స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎస్‌హెచ్‌జీల తరహాలోనే వీటిని ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లా వ్యవసాయశాఖ జేడీ ఠాకూర్‌నాయక్ మాట్లాడుతూ రైతులతో పాటు కౌలు రైతులకు కూడా ఖచ్చితంగా రుణాలు ఇప్పించే బాధ్యతను స్వచ్ఛంద ప్రతినిధులు తీసుకోవాలన్నారు. దాల్మియా భారత్ ఫౌండేషన్ ప్రతినిధి రాజశేఖర రాజు, నాబార్డు ఏజీఎం బి. శ్రీనివాసులు, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ శ్రీనివాసులు, ఏపీజీబీ రీజినల్ మేనేజర్ ప్రసాద్, లీడ్ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు పాల్గొని మాట్లాడారు.

రికార్డులను తనిఖీ చేసిన రైల్వే డీఐజీ

కడప కోటిరెడ్డి సర్కిల్ : దక్షిణ మధ్య రైల్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ పీవీఎస్ శాంతారామ్ బుధవారం కడప రైల్వేస్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేశారు. రోజుకు ఎంత మంది ప్రయాణికులు వెళుతున్నారు...ఎంతమంది వస్తున్నారు...తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. టిక్కెట్ల విక్రయాల ద్వారా ఎంత ఆదాయం వస్తుందనే విషయాలను సీసీఐ మోహన్‌దాస్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయ సిబ్బంది పనితీరును మెచ్చుకున్నారు. ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ నర్ణరామ్, ఎస్ఐ ఏకాంబరం, ఏఎస్ఐ శంకరయ్య పాల్గొన్నారు.



సిద్ధవటంరోడ్డులో సుందరంగా అలంకరించిన ప్రవేశద్వారం




తోటోత్సవంలో భాగంగా ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న సిద్ధవటంరోడ్డులోని గణనాధుడు


అద్భుతం.. తోటోత్సవం

బద్వేలు అర్బన్ : వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని సిద్దవటం రోడ్డులో వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద, నాలుగు రోడ్ల కూడలిలో ఆర్యవైశ్య వర్తక సంఘం ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద బుధవారం ఏర్పాటు చేసిన తోట ఉత్సవం స్వర్గం భువికి దిగి వచ్చినట్లుగా కనుల పండువగా సాగింది. తోటోత్సవంలో భాగంగా ఆయా మండపాలలోని స్వామి వారి ముందు వివిధ రకాల మొక్కలు, చెట్లను ఏర్పాటు చేసి అందులో వివిధ రకాల దేవతామూర్తులు, విగ్రహాలను ఏర్పాటు చేశారు.

- సిద్దవటం రోడ్డులోని మండపంలో రథంపై ఏర్పాటు చేసిన శివపార్వతుల ప్రతిమలు, బ్రహ్మ, విష్ణుమూర్తుల ప్రతిమలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.
- నాలుగు రోడ్ల కూడలిలోని మండపంలో ఆకర్షనీయంగా తయారు చేసిన పందిరిలో వెంకటేశ్వరస్వామి, లక్ష్మిదేవిల విగ్రహాలు చూపరులను ఆకర్షించాయి. అలాగే ఇక్కడ వినాయకస్వామి తులాభారం నిర్వహించడంతో పాటు పవళింపు సేవ నిర్వహించారు.



సిద్ధవటంరోడ్డులో రథంపై దర్శనమిస్తున్న దేవతామూర్తులు



నాలుగు రోడ్ల కూడలిలో ఆకర్షనీయంగా తయారుచేసిన పందిరిలో దర్శనమిస్తున్న శ్రీనివాసుడు

ఫ్యాక్షన్ గ్రామంలో.. శాం

- నాడు ఫ్యాక్షన్ గ్రామం.. నేడు ఆదర్శ గ్రామం
- దుంపల గట్టులో పూల సిరులు
- పూల సాగులో ఖాజీపేట మండలానికే ఆదర్శం
- ఆర్థిక పురోగతి చెందిన రైతులు...

ఒకప్పుడు ఫ్యాక్షన్ గ్రామంగా ముద్రపడ్డ గ్రామం దుంపలగట్టు ... రాజకీయ కక్షల వల్ల మండలంలో పనిచేసే అధికారులు, పోలీసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు... ఫ్యాక్షన్ ఘర్షణల వల్ల గ్రామంలో ఎలాంటి అభివృద్ధి లేక ప్రజలకు సంక్షేమ ఫలాలు అందక ఇబ్బందులు పడ్డారు. కానీ నేడు ఆ గ్రామంలో మచ్చుకైనా ఘర్షణ లేకుండా ప్రశాంత జీవనం గడుపుతున్నారు. రైతులంతా కలసి అన్ని రకాల పంటలు సాగుచేసుకుంటూ పచ్చని పంట పొలాలతో గ్రామం కళకళలాడేలా చేసుకున్నారు. ముఖ్యంగా పూల సాగుతో అన్నదాతలు ఆర్థిక పురోగతి వైపు అడుగులు వేస్తున్నారు. ఫ్యాక్షన్ గ్రామంలో శాంతి కుసుమాలు పూయిస్తున్నారు. ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఖాజీపేట:

ఖాజీపేట మండలంలోని దుంపలగట్టు గ్రామం అంటే ఫ్యాక్షన్ గ్రామంగా గుర్తింపు ఉంది. 1971లో రెండు కుటుంబాల మధ్య ఘర్షణ తలెత్తి ఇద్దరు హత్యకు గురయ్యారు.. గ్రామంలో వర్గపోరు కొనసాగేది. 1995లో కూడా ఇరువర్గాల వారు ఘర్షణకు దిగారు. 2001లో కూడా పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఇరువర్గాల మధ్య గొడవ పెద్ద ఎత్తున జరిగింది. బాంబులు కూడా వేసుకున్నారు. అప్పట్లో 30 రోజుల పాటు ఇరు వర్గాలకు చెందిన మగవారు గ్రామంలో లేరంటే ఏ స్థాయిలో గొడవలు జరిగాయో అర్థం అవుతుంది.

పరివర్తనతో ఫ్యాక్షన్‌కు దూరం..

ఫ్యాక్షన్ వల్ల ఒరిగిందేమీ లేదనీ.. ఇరు వర్గాల వారు తెలుసుకున్నారు. కుటుంబాలు చిన్నాభిన్నమై.. ప్రశాంతత కరువై పడిన వేదనను తలచుకున్నారు.. కుటుంబ సభ్యులు.. బంధువులు అనుభవించిన మానసిక వేదనను గుర్తించారు. ఇక ఫ్యాక్షన్ వద్దనుకున్నారు. పరివర్తన చెందారు. ప్రశాంత జీవనంవైపు అడుగులు వేశారు.. కలసిమెలసి ఉంటే వచ్చే ఆనందం ఆస్వాదించాలనుకున్నారు. ఘర్షణలకు స్వస్తి చెప్పారు.. ఎంత మార్పు వచ్చిందంటే 2006లో వచ్చిన సర్పంచ్ ఎన్నికలలో రెండు వర్గాల వారు కలసి సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తరువాత జరిగిన అన్ని ఎన్నికలు ఎలాంటి ఘర్షణ లేకుండా ప్రశాంతంగా ముగుస్తూ వస్తున్నాయి. ఆదర్శంగా నిలుస్తున్నారు.


అభివృద్ధిలో ముందంజ..


దుంపలగట్టు గ్రామంలో వెయ్యి మంది ఓటర్లు ఉన్నారు. 345 గృహాలు, 13 వందల జనాభా ఉంది. ఒకప్పుడు ఫ్యాక్షన్ గ్రామమైనా అలనాటి పరిస్థితులు నేడు లేవు. అభివృద్ధి పనులు చేసుకుంటూ గ్రామాన్ని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుకుంటున్నారు. రైతులు కూడా ఫ్యాక్షన్ వదలి వ్యవసాయరంగం పై దృష్టిసారించారు. పచ్చని పంట పొలాలతో గ్రామం కళకళలాడుతూ అన్ని రకాల పంటలు సాగు చేస్తూ ఆర్థిక పురోగతి సాధిస్తున్నారు.

పూలు.. పండ్ల తోటలతో సిరుల పంట..

గ్రామంలోని రైతులు గతంలో అందరూ వరి, పసుపు, మిర్చి పంటను అధికంగా సాగు చేసేవారు. అయితే గ్రామంలోని రమణారెడ్డి అనే రైతు మొదటిసారిగా 2004లో మల్లె పూలతోట సాగుచేసి పూల తోటల సాగుకు నాంది పలికాడు. తరువాత ఇందిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి కొత్త వంగడాల పూల తోటల సాగు చేస్తూ వచ్చారు. దీంతో గ్రామంలోని వారందరూ పూల సాగుపై దృష్టి సారించారు.

- అప్పటి నుంచి గ్రామంలోని ప్రతి రైతు తనకున్న పొలంలో కనీసం ఒక ఎకరా లేక రెండు ఎకరాల్లో పూల తోటల సాగు చేస్తున్నారు. బంతి, చామంతి, కనకాంబరం, చిట్టిరోజాలు, సంపెంగ, మల్లెపూలు ఇలా అన్నిరకాల పూల తోటలు సాగు చేస్తూ ఆర్థిక పురోగతి చెందుతున్నారు.
- పూల సాగులోని మెలకువలు పాటిస్తూ ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ పూల సాగులో ఆదర్శగ్రామంగా నిలుస్తున్నారు.





కనకాంబ

పూల సాగులో మం
రైతులు మార్కెటింగ్
చూపుతున్నారు. గత
పండించిన పూలను
పూల మార్కెట్ యా
అయితే దీని వల్ల పె

❖ అశ్వ నృత్యం.. అదుర్స్..



డప్పు వాయిద్యాలకు నృత్యం చేస్తున్న అశ్వం

పొద్దుటూరులో వినాయకుడి గ్రామోత్సవంలో ఓ గుర్రం నృత్యం చేసి ఆకట్టుకుంది. వైఎంఆర్ కాలనీలో గణనాథుని విగ్రహాన్ని బుధవారం ఊరేగించారు. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాలు, కేరళ సింగారిమేళం సందడి మధ్య ఓ గుర్రం లయ బద్ధంగా నాట్యం చేసింది. భక్తులు ఆ నృత్యం చూసి ఆశ్చర్యపోయారు.


– ప్రొద్దుటూరు కల్చరల్



తి కుసుమాలు



చిట్టిరోజాల పూలసాగు



రం చెట్లు



చెండుమల్లెపూల సాగు

ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు..

ది అనుభవం సాధించిన
లో కూడా ప్రత్యేకత
ంలో అందరూ
కడప, ప్రొద్దుటూరు
ర్డులకు పంపేవారు.
ద్దగా లాభాలు రాకపోవ

డంతో మార్కెట్ పరిస్థితులను డిమాండ్ గుర్తించారు. అందుకు తగ్గట్లుగా హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగుళూరు, గుంటూరు, కావలి ఇలా ధర అధికంగా ఉన్న ప్రాంతాలకు పూలను ఎగుమతి చేస్తున్నారు. దీనివల్ల లాభం వస్తోంది.

పూలతోటలతో లాభాలు ..



ఆకుతోటలు సాగు చేసి తీవ్రంగా నష్టపోయాను.. నాకున్న వ్యవసాయ జ్ఞానంతో కొత్త రకాల పూలతోటలు కూరగాయల కొత్త వంగడాలను తీసుకు వచ్చి సాగు చేసుకుంటూ ఆర్థిక పురోగతి సాధించాను. నాతోపాటు చాలా మంది పూలసాగు చేస్తున్నారు. నాకున్న 5 ఎకరాల్లో ప్రతి సీజన్‌లో 2 ఎకరాలు పూలతోటలు సాగు చేస్తాను.

– ఇందిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, రైతు, దుంపలగట్టు

ఘర్షణ వల్ల నష్టం తప్ప లాభం ఉండదు..



రాజకీయాల వల్ల వచ్చే ఘర్షణతో కుటుంబాలు ఆర్థికంగా నష్టపోవడం తప్ప లాభం లేదు. అందుకే నాకున్న పొలంలో పూలతోటలు హార్టికల్చర్ పంటలు సాగుచేసుకుంటూ మంచి దిగుబడి సాధించే ప్రయత్నం చేస్తున్నాను. గ్రామంలోని చాలా మంది వ్యవసాయం పైనే దృష్టిసారించి మంచి ఫలసాయంతో ఆదాయం సంపాదించుకుంటున్నారు.

– పత్తి ఈశ్వర్ రెడ్డి, రైతు, దుంపలగట్టు

అభివృద్ధితోనే ఫ్యాక్షన్ దూరం...



గ్రామంలో సుమారు 3 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.. సీసీరోడ్లు, వీధి దీపాలతోపాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.. జలసిరి ద్వారా రైతులకు బోర్లు ఇస్తున్నాం.. గ్రామంలో ప్రతి కుటుంబం అర్థిక అభివృద్ధి చెందాలి. అప్పుడే ఫ్యాక్షన్ పూర్తిగా దూరమవుతుంది.

– రెడ్యం చంద్రశేఖర్ రెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు

మస్తాన్‌బన్నిని సత్కరిస్తున్న దృశ్యం



ప్రముఖుల నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న బన్నీ (ఫైల్)



నృత్య తేజం

- డ్యాన్స్‌లో రాణిస్తున్న మస్తాన్ బన్నీ
- వరించిన బహుమతులు, అవార్డులు

వీరబల్లి: వీరబల్లి మండలం వీరబల్లి గ్రామానికి చెందిన మస్తాన్ బన్నీకి నాట్యం అంటే ఎంతో ఇష్టం. గ్రామంలో ఎక్కడైనా డ్యాన్స్‌వేస్తుంటే అక్కడికెళ్లేవాడు. వారు చేసే డ్యాన్స్ చూస్తూ.. తాను కూడా నేర్చుకోవాలనుకున్నాడు. పట్టుదలతో సాధన చేసి నాట్యం నేర్చుకున్నాడు. ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి శభాష్ అనిపించుకున్నాడు. అయితే తను నాట్యం నేర్చుకోవడానికి సహాయ పడిన వారి రుణం ఎన్నటికీ తీర్చుకోలేనని చెబుతున్నాడు. ఆయన మాటల్లోనే...‘ మాది పేద కుటుంబం. మా నాన్న టైలర్. ఆ పనిచేస్తూనే కుటుంబాన్ని పోషించేవారు.. నాకు నాట్యంపై ఇష్టంతో ఆ దిశగా అడుగులు వేశా. పీలేరులో ఒక డ్యాన్స్‌స్కూల్‌లో చేరాను. అయితే అక్కడే పెయింటింగ్ పనులు చేసుకుంటూ వచ్చే అరకొర డబ్బుతో రోజులు భారంగా గడిపేవాన్ని. ఈ తరుణంలో అక్కడి ఝాన్సీ హాస్పిటల్ డాక్టర్ దినేష్‌రెడ్డి నన్ను ఆదరించారు. కొన్నేళ్ల వరకు తిండి, ఖర్చులు అన్నీ ఆయనే చూసుకునేవారు. ఆయన సహాయ సహకారాలతో తిరుపతిలోని ఎస్.వి.మ్యూజిక్ కళాశాలలో చేరి భరత నాట్యంలో తర్ఫీదు పొందుతున్నా. ‘వే’ ఫౌండేషన్ సంస్థ వారు నా టాలెంట్‌ను చూసి ఢిల్లీదాకా తీసుకెళ్లారు. అక్కడ నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నా. 600లకు పైగా నృత్య ప్రదర్శనలలో పాల్గొన్నా. జ్యోతిరావ్‌పూలే నేషనల్ ఫిలోషిప్ అవార్డును ఢిల్లీలో అందుకున్నా. డ్యాన్స్ పోటీల్లో ఎన్నో బహుమతులు పొందాను. ఇంకా ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి ఇంకా మంచి పేరు తెచ్చుకుంటాను. నృత్యమే నా ఆరోప్రాణం..’ అని సాక్షికి వివరించాడు.



నృత్య భంగిమలో మస్తాన్ బన్నీ



ఆడవేషంలో మస్తాన్ బన్నీ

❖ నగరం.. రంగులద్దుకుంటోంది..!









కడప నగరం.. రంగులద్దుకుంటోంది.. సుందరీకరణ దిశగా అడుగులేస్తోంది. నగరపాలక సంస్థ, పలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి గోడపత్రాలు, మట్టితో అధ్వాన్నంగా మారిన నగర వీధుల గోడలను అందమైన చిత్రకావ్యాలుగా మారుస్తోంది. కళాకారుల స్వచ్ఛసూక్తులు, ప్రముఖుల బొమ్మలు, గత చరిత్రను తెలిపే చిత్రాలను ఆకర్షణీయంగా రూపొందిస్తున్నారు. వీటితో పాటు డివైడర్లకు సైతం రంగులు దిద్దుతూ ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. - వైవీయూ



సౌకర్యాలను సద్వినియోగం చేసుకోండి

పశువైద్య కళాశాలను సందర్శించిన ఐసీఏఆర్ బృందం



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీఏఆర్ అధికారులు

ప్రొద్దుటూరు : కళాశాలలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని న్యూఢిల్లీకి చెందిన భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) అధికారులు సూచించారు. ప్రొద్దుటూరు పశువైద్య కళాశాలను బుధవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కళాశాల నిర్మాణం చాలా బాగుంద న్నారు. సౌకర్యాలను వినియోగించుకుంటే విద్యార్థులకు లాభం చేకూరుతుందని తెలిపారు. అక్రిడేషన్ మంజూరు కోసం కళాశాల ఏర్పాటు తర్వాత తొలిమారు ఈ బృందం ఇక్కడికి వచ్చింది. ఉదయం 10 గంటల ప్రాంతంలో తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం నుంచి వచ్చిన అధికారులు సాయంత్రం 4 గంటల వరకు కళాశాలను పరిశీలించారు. ఇందులో భాగంగా అన్ని డిపార్ట్‌మెంట్లను సందర్శించి అధ్యాపకులతో చర్చించి అభిప్రాయాలు తెలుసుకున్నారు.

విద్యార్థులతో మాట్లాడారు. తర్వాత ఐఎల్ఎఫ్‌సీ డిపార్ట్‌మెంట్ వద్ద మొక్కలు నాటారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి (న్యూఢిల్లీ)కి సంబంధించి డాక్టర్ ఏకే గెహ్లాట్, డాక్టర్ రిషేంద్రవర్మ, డాక్టర్ ఏకే సింగ్, డాక్టర్ జి.వెంకటేశ్వర్లుతోపాటు శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ కె.సర్జన్ రెడ్డి, డీన్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ చంద్రశేఖర్‌రావు పరిశీలించారు. వీరి వెంట కళాశాల అసోసియేట్ డీన్ ఎ.ఆనంద్‌కుమార్‌తోపాటు ఆయా డిపార్ట్‌మెంట్లకు చెందిన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు.

అంతా ఓపెన్?

- **అంగడి సరుకుల్లా ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ఎంపిక?**
- **జాబితా తయారీలో అవకతవకలు**



కడప ఎడ్యుకేషన్:

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల జాబితా ఎంపికలో అవకతవకలు జరిగినట్లు అరోపణలు వస్తున్నాయి. నిబంధనల ప్రకారం ఉత్తమ ఉపాధ్యాయ ఎంపికకు సంబంధించిన జాబితాను అధికారులు గోప్యంగా ఉంచాలి. ఎంపిక కమిటీలో సభ్యులెవరనేది కూడా అత్యంత గోప్యంగా ఉంచాల్సి ఉంది. కానీ డీఈఓ కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయ ఎంపికకు సంబంధించిన జాబితా తయారీ అంతా ఓపెన్‌గా జరిగినట్లు వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. అంతేకాకుండా అవార్డులను అంగడిలో సరుకుల్లా బేరాలు పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రతి ఏటా సెప్టెంబర్ 5వ తేదీ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బోధనతోపాటు అన్ని విషయాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులకు ఈ అవార్డులను అందజేస్తారు. ఇందులో కేటగిరి వారీగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నుంచి (ప్రస్తుతం విధుల్లో ఉన్న వారు. పదవీ విరమణ చేసిన వారితో కలుపుకొని) ఉత్తమ అవార్డుల కోసం ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. ఇందులో జిల్లాస్థాయి అవార్డుకు 16 సంవత్సరాలు, రాష్ట్రస్థాయి అవార్డుకు 20 సంవత్సరాలు అనుభవవం కలిగి ఉండాలి. దరఖాస్తు చేసుకున్న వాటిని కమిటీ పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తారు. ఎంపికైన రాష్ట్రస్థాయి అవార్డులను సెప్టెంబర్ 5వ తేదీ ముఖ్యమంత్రి చేతులమీదుగా, జిల్లాస్థాయిలో కలెక్టర్ నుంచి అందించడంతోపాటు సన్మానం చేస్తారు.

కమిషనర్‌కు ఫిర్యాదు

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల జాబితాలో అధికారులు డబ్బులు తీసుకుని అవకతవకలకు పాల్పడినట్లు ఓ వ్యక్తి రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారని తెలిసింది. అనర్హులకు అవార్డులను ఇచ్చేందుకు జాబితాను సిద్ధం చేశారని ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై కమిషనర్ స్పందించి విద్యాశాఖాధికారులను వివరణ కోరినట్లు తెలిసింది.

వేరే వారికి చార్జి

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల జాబితా తయారీలో అవకతవకలు జరిగినట్లు వచ్చిన ఆరోపణల దృష్ట్యా సంబంధిత పర్యవేక్షణాధికారి సీటు నుంచి తొలగించి ఈ బాధ్యతలను మరొకరికి అప్పగించినట్లు సమాచారం.

జాబితాలో అవకతవకలు?

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం మండలాల వారీగా ప్రతిభ అధారంగా దరఖాస్తు చేసుకుంటారు. ఇందులో మండలస్థాయిలో ఎంఈఓ, డివిజన్ స్థాయిలో డిప్యూటీ డీఈఓలు సిఫారసు చేసి డీఈఓకు జాబితాను పంపుతారు. దీనిని కమిటీ పరిశీలించి డీఈఓ ద్వారా విద్యాశాఖ కమిషనర్‌కు పంపాల్సి ఉంటుంది. జాబితా తయారీ డీఈఓ కార్యాలయంలో ఒక సెక్షన్‌కు సంబంధించిన సూపరింటెండెంట్ పర్యవేక్షిస్తాడు. అంతా ఆయన పరిధిలోనే గోప్యంగా జరగాల్సి ఉంది. కానీ బాహాటంగా అందరికి తెలిసేటట్లు జాబితాను ఎంపిక చేసినట్లు సమాచారం. గతేడాది అవార్డుల పొందిన వారి పేర్లను కూడా మళ్లీ పంపినట్లు తెలిసింది.

ఎలాంటి అవకతవకులు జరగలేదు



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికలో ఎలాంటి అవకతవకలు జరగలేదు. అంతా పారదర్శకంగా జరిగింది. ఆరోపణలంతా కేవలం అపోహలు మాత్రమే.

- పొన్నతోట శైలజ, జిల్లా విద్యాశాకాధికారి

వర్షాకాలంలో జీవాలకు వ్యాధులు.. అప్రమత్తత అవసరం


పశువైద్యాధికారి శ్రీవాణి

వేముల :

గ్రామీణ ప్రాంతాలలో గొర్రెలు, మేకల పెంపకం జీవనాధారంగా ఉంటోంది. వీటి పెంపకం చేపట్టే వారిలో సన్న, చిన్నకారు రైతులు, రైతు కూలీలు అధికం. గొర్రెలు, మేకలు ఆరోగ్యంగా ఉంటేనే ఆదాయం ఉంటోంది. అయితే అవి వ్యాధుల బారినపడినప్పుడు కలిగే నష్టం అపారం. గొర్రెలు, మేకలలో అతిగా నష్టం కలిగించే వ్యాధులలో నీలి నాలుక వ్యాధి, కాలిపుండ్ల వ్యాధి, దొమ్మ వ్యాధి ప్రమాదకరమైనవి. ఈ వ్యాధులు సోకితే చేపట్టాల్సిన చర్యలు, వర్షాకాలంలో జీవాలకు వచ్చే వ్యాధుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వేముల పశువైద్యాధికారి శ్రీవాణి ఇలా వివరిస్తున్నారు.

నీలి నాలుక వ్యాధి.. :

నీలి నాలుక వ్యాధి గొర్రెలలో అధికంగానూ, మేకలలో స్వల్పంగానూ వస్తుంది. మూతి వాపు వ్యాధి, పూత రోగం, నోటి పుండ్లు పేరుతో వ్యవహరించే ఈ వ్యాధి దోమలు ఉధృతంగా ఉండే ఆగస్ట్, సెప్టెంబర్ నెలల్లో వస్తుంది. ఈ వ్యాధి ఆర్బో వైరస్ ద్వారా క్యులికాయిడస్ అనే దోమ ద్వారా, అర్నితోడోరాస్ అనే పిరుదుల ద్వారా వ్యాప్తి చెందుతుంది.

వ్యాధి లక్షణాలు.. :

వ్యాధి వలన మందలోని సగం జీవాలకు సోకి 10శాతం మరణి స్థాయి. జ్వరం, 105 డిగ్రీల నుంచి 107 డిగ్రీల వరకు ఉంటుంది. మూతి, పెదవులు, చిగుళ్ల, నాలుక, ముఖం వాచి ఎర్రబడుతుంది. వ్యాధి చివర దశలో నాలుక నీలి రంగులోకి మారుతుంది. నేటి నుంచి దుర్వాసన వస్తుంది. అంతేకాక నోటి నుండి నురగతో కూడిన చొంగ, కళ్లు, ముక్కుల నుండి స్రావాలు కారుతుంటాయి. గిట్టల పైభాగం, కెరోనేట్ ఎర్రగా కందిపోయి వాచి, చీము పట్టి నడవలేక కుంటుతుంటాయి.

చికిత్స : వైరస్ వలన కలిగే వ్యాధి కనుక చికత్స వలన పెద్దగా ప్రయోజనం ఉండదు. వ్యాధి తీవ్రతపై సూర్య రశ్మి ప్రభావం ఉంటుంది. కనుక వ్యాధిగ్రస్త జీవాలను నీడలో ఉంచి చికిత్స చేయించాలి. సెకండరీ బ్యాక్టీరియా వలన కలిగే దుష్ఫలితాల నివారణకు యాంటి బయోటిక్ ఇంజక్షన్లు 3నుంచి 5రోజులు వాడాలి. నోటి పుండ్లకు బోరోగ్లిసరిన్ మిశ్రమాన్ని పూయాలి.

నివారణ: వ్యాధి సోకిన జీవాలను మందలో పం పకూడదు. ఈ వ్యాధి దోమ కాటు వలన వ్యాపిస్తున్నందున దోమల నివారణకు వేపాకు, యూకలిప్టస్, కలబంద ఆకు, పిడకల్ని కాల్చి దోమలను నివారించాలి. ప్రభుత్వం సరఫరా చేస్తున్న రక్షా, బ్లూ టీకాను 2ఎంఎల్ చర్మం కింద వేయాలి.

దొమ్మ వ్యాధి (ఆంత్రాక్స్)


అంత్రాక్స్ వ్యాధితో చనిపోయిన గొర్రె

నెత్తురు కట్టు రోగం, నెరడవాపు, నల్లజాడ్యం, దొమ్మ నెరడు రోగం, రక్త దొమ్మ వంటి పేర్లతో వ్యవహరించే ఈ వ్యాధి సోకితే జీవాలతోపాటు పశువులు కూడా మరణిస్తాయి. ఎక్కువగా వరదల సమయంలో ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. గతంలో వ్యాధి సంభవించిన ప్రాంతాలలో సంవత్సరం పొడవునా వ్యాప్తి చెందుతూ ఉంటుంది. గొర్రెలలో ఎక్కువగా మేకలలో తక్కువగా సోకుతుంది. బాసిల్లిస్ ఆంత్రాసిస్ అనే బ్యాక్టీరియా ద్వారా కానీ, కలుషితమైన నీరు, మేత ద్వారా సోకుతుంది. చర్మం తీయడం, సంతానం వలన మనుషులకు కూడా సోకుతుంది.

లక్షణాలు: ఈ వ్యాధి సోకితే ఒకటి అంతకన్న ఎక్కువ జీవాలు అకస్మాత్తుగా చనిపోతాయి. చనిపోయిన జీవాల మూతి, ముక్కు, చెవులు మొదలగు బాహ్య రంధ్రాల నుండి నురగతో కూడిన నల్లని గడ్డ కట్టని రక్తం స్రవిస్తుంది. నాలుక, గొంతు కింద వాపు వలన శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. కడుపు నొప్పి, రక్త విరేచనాలు ఉంటాయి. జ్వరం 105 నుండి 10 7డిగ్రీలు ఉంటుంది. జీవాలు ముడుచుకొని ఒకే చోట నిలబడతాయి.

చికిత్స : ఈ వ్యాధి సోకిన జీవాలకు చికిత్స చేసే వ్యవధి ఉండదు. మందలో మెత్తగా ముడుచుకొని ఉన్న జీవాలకు పెన్సిలిన్ యాంటి బయోటిక్ మందులు ఇవ్వాలి.

నివారణ : ఈ వ్యాధి తరచూ ప్రబలే ప్రాంతంలో జీవాలకు ఏటా సెప్టెంబర్ మాసంలో టీకాలు వేయించాలి. టీకాలు వేసే సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. బ్యాక్టీరియా స్పోరులా నేలలో 50ఏళ్ల వరకు జీవించి ఉండి వ్యాధిని కలిగిస్తాయి. చనిపోయిన జీవాల్ని కోయకూడదు. లోతైన గుంత తీసి సున్నంవేసి పాతిపెట్టాలి. వ్యాధిగ్రస్త జీవాలు తినగా మిగిలిన గడ్డి, దాణాను కాల్చి వేయాలి.

కాలి పుండ్ల వ్యాధి(పుట్‌రాట్) : గిట్టల పుండ్లు, బురద పుండ్లు, మతువ కాళ్లు మొదలగు పేర్లతో వ్యవహరించే ఈ వ్యాధి వర్షాకాలంలో గొర్రెలు, మేకలకు ఎక్కువగా సోకుతుంది. స్పోరో పోరస్ నోడోసిస్ అనే బ్యాక్టీరియా వలన కలుగుతుంది. బురద నేలలో తిరిగినప్పుడు వరి కోతల తర్వాత పొలాల్లో తిరిగినప్పుడు ఈ వ్యాధి ఎక్కువగా సోకుతుంది.

లక్షణాలు : గిట్టల మధ్య చర్మం మెత్తబడి వాచి చిట్లిపోతుంది. నొప్పితో ముందు కాళ్లపై గెంటుతుంది. వ్యాధి తీవ్రంగా సోకితే గిట్టలు ఊడిపోతాయి. జీవాలు నడవలేకపోతాయి. వ్యాధి సోకిన జీవాలు కుంటుతూ నడవలేకపోవడం వలన గమనించవచ్చు.

చికిత్స : ఈ వ్యాధి సోకిన గొర్రెల కాళ్లను 10శాతం మైలు తుత్తు, లేదా 10శాతం జింక్ సల్ఫేట్ లేదా 10శాతం పార్మలిన్ ద్రావణంలో ముంచాలి. యాంటి బయాటిక్ ఇంజక్షన్లు వరుసగా 3నుంచి 5రోజులు వేయించాలి. కాళ్ల నొప్పులు తగ్గడానికి అవసరమైన ఇంజక్షన్లు వేయించాలి.

నివారణ : జీవాలను చిత్తడి నేలల్లో ఎక్కువగా తిరగనీయరాదు. పొడిగా ఉండే ప్రదేశంలో మేపాలి. సిమెంట్ పుట్‌పాత్ ఏర్పాటు చేసి అందులో 10శాతం పొటాషియం పర్మాంగనేటు ద్రావణం పోసి దానిపై జీవాల్ని ప్రతిరోజు 3నుంచి 5నిమిషాలు నడిపించాలి.

వరద చెబితేనే రుణాలు

మంజూరు చేస్తారా?

- కార్యాలయంలో కమీషన్లు ఎందుకు వసూలు చేస్తున్నారు
- అధికారులపై ఎమ్మెల్యే రాచమల్లు ఆగ్రహం


మండల పరిషత్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : ఎన్నికల్లో ఓటమిచెందిన వరదరాజులరెడ్డి లెటర్ ప్యాడ్ పైన పేర్లు రాసిస్తేనే రుణాలు మంజూరు చేస్తారా... ఆయనకు ఉన్న అర్హత ఏమిటి? ప్రజా ప్రతినిధిగా తనకు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత లేదా అని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మండల పరిషత్ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణం కోసం మండల పరిషత్ కార్యాలయానికి వస్తే వరదరాజులరెడ్డి లెటర్ ప్యాడ్ కావాలని అధికారులు చెప్పడంతో ఓ బాధితుడు ఎమ్మెల్యేను ఆశ్రయించారు. దీంతో ఆయన నేరుగా బుధవారం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పారదర్శకంగా పనులు జరిగితే తాను కార్యాలయానికి రానని తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు మొదలు ఎంపీ వరకు అన్నింటా జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రజాప్రతినిధులు ఉన్నారన్నారు. మండల పరిషత్ అధ్యక్షురాలితోపాటు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలో కూడా తమ పార్టీ వారే ఎక్కువగా ఉన్నారని తెలిపారు. అలాంటప్పుడు వరద లెటర్ ప్యాడ్ ఇచ్చిన వారికే ఎలా రుణాలు ఇవ్వాలని ప్రతిపాదనలు పంపుతారన్నారు.

కార్యాలయంలో లంచగొండితనం లేదా...

మండల పరిషత్ కార్యాలయంలో లంచగొండితనం లేదా... ఏ పనికి ఎంతెంత వసూలు చేస్తున్నారో తనకు తెలియదా అని ఎమ్మెల్యే అన్నారు. మరుగుదొడ్ల కోసం దరఖాస్తు చేసిన వారి నుంచి కూడా రూ.100 వసూలు చేయడం దేనికి నిదర్శమని ప్రశ్నించారు. గాడితప్పిన అధికారుల పట్ల ఎలా వ్యవహరించాలో తనకు తెలుసు అన్నారు. ఆర్డీఓ వినాయకంకు ఏ గతి పట్టిందో ఆలోచించుకోవాలని చెప్పారు.

ఉద్యోగాలిప్పిస్తానని మోసం

ప్రొద్దుటూరు :

అంగన్‌వాడీ ఆయాపై ఆరోపణలు

ఐసీడీఎస్ ప్రొద్దుటూరు రూరల్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న ఆయా ఓ సంస్థలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగులను మోసం చేసి డబ్బు వసూలు చేసినట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ పేరుతో నకిలీ సంస్థను ఏర్పాటు చేశారు. అందులో జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని సంస్థ సభ్యులు రాష్ట్రస్థాయిలో నిరుద్యోగులను మోసం చేసినట్లు సమాచారం. ఇందులో భాగంగా ప్రొద్దుటూరులోని పలువురు నిరుద్యోగులు అంగన్‌వాడీ ఆయా చేతికి డబ్బు ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆమె ప్రస్తుతం ఆరోగ్యం బాగాలేదని సెలవులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.


వైద్యుల నిర్లక్ష్యంతో కడుపులో బిడ్డ మృతి

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం వల్ల బిడ్డ కడుపులోనే మృతి చెందిందని అనంతరాజంపేట గ్రామానికి చెందిన కొత్తపేట రోహిణి భర్త లక్ష్మినరసయ్య, తల్లి పెంచలమ్మలు రైల్వేకోడూరు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. గర్భం దాల్చిన మొదటినెల నుంచి పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నామని తెలిపారు. ఈనెల 24వ తేదీన చికిత్సచేయించుకుని ఇంటికి వెళ్లామన్నారు. తర్వాత 26వ తేదీన ఆస్పత్రికి వస్తే పరీక్షించి రక్తం తక్కువగా ఉందని తిరుపతికి వెళ్లాలని చెప్పారన్నారు. తిరుపతిలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి సంప్రదిస్తే బిడ్డ ఒకరోజు ముందుగానే చనిపోయిందని వైద్యులు నిర్ధారించినట్లు వారు పేర్కొన్నారు. ఈ మేరకు వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ట్రావెల్స్ బస్సులో మంటలు

- అప్రమత్తమై బయటకొచ్చిన ప్రయాణికులు
- 44 మంది ప్రయాణికులు సురక్షితం
- క్షణాల్లో బూడిదైన బస్సు
- త్రుటిలో తప్పిన ప్రమాదం
- ఒంగోలు-నంద్యాల రోడ్డులో ఘటన



దగ్ధమైన బస్సు, ప్రయాణికులతో మాట్లాడుతున్న సీఐ

కొనకనమిట్ల/హనుమంతునిపాడు (ప్రకాశం జిల్లా) : కడప నుంచి విజయవాడకు 43 మంది ప్రయాణికలుతో బయల్దేరిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో ఉన్నట్టుండి మంటలు వ్యాపించాయి. అప్రమత్తమైన ప్రయాణికులు, డ్రైవర్ పరుగున కిందకు రావడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ సంఘటన ఒంగోలు-నంద్యాల రహదారి తాడివారిపల్లి ఘాట్‌కు సమీపంలో మహమ్మదాపురం స్టేజీ వద్ద బుధవారం తెలవారు జామున 2 గంటల సమయంలో జరిగింది. బస్సు డ్రైవర్ ఎస్.కేశవ కథనం ప్రకారం.. ఏపీ 29 టీబీ 0306 నంబర్‌తో మేఘన ట్రావెల్స్‌కు చెందిన ఏసీ బస్సు మంగళవారం రాత్రి 9.40 గంటలకు కడప నుంచి 43 మంది ప్రయాణికులతో విజయవాడ బయల్దేరింది. సుమారు 2 గంటల సమయంలో బస్సు తాడివారిపల్లి ఘాట్ దిగి మహమ్మదాపురం స్టేజీ వద్దకు వచ్చే సరికి ఇంజిన్ నుంచి పొగతో కూడిన వాసన వచ్చింది. గమనించిన డ్రైవర్ కేశవ బస్సును రోడ్డు మార్జిన్‌లో ఆపాడు. కిందకు దిగి చూడగా అప్పటికే బస్సు ముందు భాగంలో మంటలు వచ్చి పొగలు కమ్ముకున్నాయి. భయాందోళన చెందిన ప్రయాణికులు డ్రైవర్ కేకలతో కిందకు దిగారు. ఆ వెంటనే బస్సు మంటల్లో చిక్కుకుంది. ప్రయాణికుల బ్యాగులు, ఇతర వస్తువులు కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న దర్శి అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వచ్చి మంటలు ఆర్పేశారు. పొదిలి సీఐ శ్రీనివాసరావు, హనుమంతునిపాడు ఎస్ఐ హరిబాబు, కొనకనమిట్ల ఏఎస్ఐ అల్లాబక్షులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదం జరిగిన తీరును ప్రయాణికులు, డ్రైవర్‌ను అడిగి తెలుసుకున్నారు.

సుమోల్లో ప్రయాణికుల తరలింపు

బస్సు యజమాని వచ్చి బేస్తవారిపేట నుంచి సుమోలు రప్పించారు. సురక్షితంగా బయటపడిన ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చారు. విజయవాడ, కడప వెళ్లే వారిని సుమోల్లో తరలించారు. డ్రైవర్ కేశవ అప్రమత్తం కావడం వల్లే ప్రమాదం నుంచి సురక్షితంగా బయట పడ్డామని ప్రయాణికులు పసుపులేటి రామలక్షుమ్మ, శైలజ, చప్పిడి కవిత తెలిపారు. భయంతో లగేజీలు వదిలి బస్సు దిగామని చెప్పారు. రామలక్షమ్మకు చెందిన 3 తులాల బంగారు చైను, రూ.20 వేల నగదు, శైలజకు చెందిన లాప్‌ట్యాబ్ కాలి బూడిదయ్యాయి. ప్రయాణికులను దించే సమయంలో క్యాబిన్‌లో ఉన్న తన లైసెన్స్, రూ.7 వేలు నగదు కాలి బూడిదయ్యాయని డ్రైవర్ కేశవ ఆవేదన వ్యక్తం చేశారు.

సమాచారం వార్తలు

కడప సినిమాలు



రవి : నేనే రాజు..నేనే మంత్రి
ప్రతాప్ : ఆనందో్బ్రహ్మ
రాజా (రహత్) : వివేకం
మురళి : జయ జానకి నాయక
సుధ : ఫిదా
తాహెర్ : బందూక్ బాజ్
అమీర్ : ఎ జెంటిల్‌మెన్
రమేష్ : వీఐపీ–2
అప్సర : వివేకం
ఎస్‌ఆర్ (సాయిబాబా) : అర్జున్ రెడ్డి

నోటీస్ బోర్డ్

రేపటి నుంచి యోగా శిక్షణ శిబిరం
కడప నగరం పటేల్ రోడ్డులోని మిత్ర యోగా కేంద్రంలో సెప్టెంబర్ 1 నుంచి యోగా శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆ సంస్థ నిర్వహకులు యోగా థెరపిస్ట్ డాక్టర్ ఆర్. రంగనాథ రెడ్డి, డాక్టర్ కె.కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. మానసిక ఒత్తిడి, డయాబెటీస్, అధిక బీపీ, కీళ్లనొప్పులు, గుండె జబ్బులు, అస్తమా, గ్యాస్ సమస్య లాంటి దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు యోగాసనాలు శాస్త్రీయ పద్ధతిలో సాధన చేయిస్తామన్నారు. ప్రతి రోజు ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు మొదటి బ్యాచ్, సాయంత్రం 5.30 నుంచి 7.00 గంటల వరకు రెండో బ్యాచ్ ఉంటుందని అన్నారు. ఆసక్తిగల వారు 9848861206, 9440074773 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.
–కడప కల్చరల్

పోలీస్ డైరీ

వ్యక్తిపై దాడి – కేసు నమోదు
ఓ స్థలం విషయంలో ఆలంఖాన్‌పల్లెకు చెందిన మహేష్, బాషా, శ్రీను, రఘునాథరెడ్డి అనే వ్యక్తులు తనపై దాడి చేసి గాయపరిచారని అదే ఊరుకు చెందిన సుబ్బరాయుడు అనే వ్యక్తి కడప వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నెల 27న కడప తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉండగా దాడి చేశారని పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని వన్‌టౌన్ ఎస్‌ఐ నరసింహారాజు తెలిపారు.

మోచంపేటలో చోరీ.. మోచంపేటలో రెండవగాంధీ బొమ్మసమీపంలో నివసిస్తున్న సుబ్బరాయుడు అనే వ్యక్తి ఇంట్లో చోరీ జరిగింది. ఈనెల 29న తిరుమలకు వెళ్లిన సుబ్బరాయుడు బుధవారం ఉదయం ఇంటికి వచ్చిచూసే సరికి చోరీ జరిగినట్లుగా గుర్తించాడు. ఒకటిన్నర తులం బంగారు ఆభరణాలు, 100 గ్రాముల వెండి అపహరణకు గురైనట్లు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.
–కడప అర్బన్

చిన్నబోయిన చిన్నచౌకు

కడప నగరంలో ఒకప్పటి మేజర్ గ్రామ పంచాయతీ అయిన చిన్నచౌకు సమస్యలతో చిన్నబోతోంది. సరైన రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేక అభివృద్ధికి ఆమడదూరంగా నిలిచింది. అధికారుల నిర్లక్ష్యానికి గురై రోదిస్తోంది. ఆదరించాలని వేడుకుంటోంది.

చిన్నచౌక్ (కడప కార్పొరేషన్) :

చిన్నచౌకు పంచాయతీలోని చాలా ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. ఆంజనేయ స్వామి ఆలయం ఉన్న వీధిలో పోలేరమ్మ గుడి పక్కన రోడ్డు, డ్రైనేజీ కాలువ పూర్తిగా దెబ్బ తిన్నాయి. సిమెంటు రోడ్డుగా ఉన్న దీన్ని భూ గర్భ డ్రైనేజీ పనుల పేరుతో పూర్తిగా పగులగొట్టి వదిలేశారు. ఏళ్లు గడుస్తున్నా దీన్ని మరమ్మతులు చేయడానికి నగరపాలక అధికారులకు మనసు రావడం లేదు. ముఖ్యంగా ఈ వీధిలో పాడి ఎక్కువగా ఉండటం వల్ల పశువుల పేడ, గంజుతో తీవ్ర అపరిశుభ్ర పరిస్థితులు ఉన్నాయి. వీధి వీధంతా గుంతలమయమై, చెత్తచెదారంతో నిండిపోయి ఉంది. అలాగే చిన్నచౌకులోని ఇతర రహదారులు, కాలువల పరిస్థితి ఇలాగే ఉంది.

తిలక్‌నగర్‌లో తాగు నీటి సమస్య

తీవ్రమైన తాగు నీటి ఎద్దడితో తిలక్‌నగర్ ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. ఇక్కడ మున్సిపల్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన బోరింగ్ స్థానంలో కొత్తది వేస్తామని చెప్పి ఊడదీసుకెళ్లారు. ఏళ్లు గడుస్తున్నా కొత్త బోరింగ్ వేయలేదు. దీంతో బోరింగ్‌లేని బోరు బావి ప్రమాదకరంగా మిగిలిపోయింది. ఇక్కడ నాలుగు రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా అవుతాయి. ఇక భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి ఉబికి వస్తున్న డ్రైనేజీ నీరు ఇళ్లముందు నిలవడంతో దోమలు విపరీతంగా ఉన్నాయి. అలాగే పందుల బెడద కూడా తీవ్రంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. పైపులైన్ పగిలిపోయి నెలలు గడుస్తున్నా నగర పాలక సిబ్బంది మరమ్మతు చేయలేదని చెబుతున్నారు.

అన్ని కాలనీల్లోనూ వసతులు కరువు

ఈ కాలనీకి సమీపంలోనే ఉన్న దండోరా కాలనీ, అరుంధతీ నగర్, రామకృష్ణ నగర్, శాంతినగర్, సెంట్రల్ జైలు పరిసరాల్లో ఉన్న శ్రీరామ్‌నగర్, సుందరయ్య నగర్, ఎలక్ట్రిసిటీ కాలనీ, వైఎస్‌ఆర్ పోలీసు కాలనీ ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.







1.చిన్నచౌకులో పగిలిపోయిన సిమెంటు రోడ్డు
2. దండోరా కాలనీలో బురదతో నిండిన రోడ్డు
3. తిలక్‌నగర్‌లో నీటిని పట్టుకునేందుకు బాలిక అవస్థ



చిన్నచౌకులో పేడతో నిండిపోయిన రోడ్డు



తిలక్‌నగర్‌లో ఇళ్లముందు డ్రైనేజీ నీరు

దోమలతో చచ్చిపోతున్నాం



దోమలు, ఈగలతో చచ్చిపోతున్నాం, పశువుల పేడ, రొచ్చు అంతా కాలువల్లోకి వస్తోంది. అదంతా బ్లాక్ అయి ఇక్కడే ఉంది. సాయంత్రమైతే దుర్వాసన, ఒకటే దోమలు. కుట్టి కుట్టి దద్దుర్లు వస్తున్నాయి. - జయలక్ష్మి, చిన్నచౌకు

ఉన్న బోరును పీకేశారు



కొత్త బోరు వేస్తామని చెప్పి ఉన్న బోరును పీకేశారు. కాలనీలో ఎక్కడా కొళాయిలు లేవు. భూమిలోంచి కనిపిస్తున్న పైపునకు మరోపైపు ఏర్పాటు చేసుకొని నీళ్లు పట్టుకోవాలి. నాలుగు రోజులకు ఒకసారి నీళ్లు వస్తాయి.
- లక్ష్మిదేవి, తిలక్‌నగర్

రోడ్డు శాంక్షన్ అయిందంట



ఆంజనేయస్వామి ఆలయం నుంచి రోడ్డు శాంక్షన్ అయ్యిందని చెప్పారు కానీ ఇంత వరకూ రోడ్డు నిర్మించలేదు. కాలువ పూర్తిగా పాడైపోయింది. అందులో నీళ్లుపోవడం లేదు. కాలువ నుంచి వచ్చే దుర్వాసన భరించలేకున్నాము. రోడ్డు, కాలువలు నిర్మించాలి.
- సుబ్బరాయుడు, చిన్నచౌకు.

తెలుగు పద్యార్చన పోటీల్లో ప్రతిభ

కడప ఎడ్యుకేషన్ : నగర శివార్లలోని కొలుములపల్లె ప్రాథమిక పాఠశాలకు చెందిన వైష్ణవి అనే విద్యార్థిని తెలుగు పద్యార్చన పోటీల్లో ప్రతిభ చూపింది. తెలుగుభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప సీపీబ్రౌన్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పద్యార్చన పోటీల్లో ద్వితీయస్థానంలో నిలిచింది. విశేష ప్రతిభ చూపిన వైష్ణవిని, ప్రోత్సహించిన తెలుగుటీచర్ సాయిని, హెచ్‌ఎం వీరేంద్రబాబులను డీఈఓ శైలజ, డిప్యూటీ ఈఓ నాగమునిరెడ్డి డీఈఓ కార్యాలయంలో అభినందించారు.



మిలియన్ మార్చ్‌కు ఎస్టీయూ మద్దతు

కడప ఎడ్యుకేషన్ : సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని కోరుతూ సెప్టెంబర్ 1న విజయవాడలో నిర్వహిస్తున్న మిలియన్ మార్చ్‌కు ఎస్టీయూ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, ఇలియాస్‌బాషా తెలిపారు.

మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయాలి...
సెప్టెంబర్ 1వ తేదీన నిర్వహించే మిలియన్‌మార్చ్‌ను విజయవంతం చేయాలని వైఎస్సాఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకట రమణారెడ్డి, నాయకులు, రెడ్డెప్పరెడ్డి, శివశంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు.

జయప్రదం చేద్దాం
సీపీఎస్ రద్దు కోసం నిర్వహించనున్న మిలియన్ మార్చ్‌ను జయప్రదం చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మిట్టా క్రిష్ణయ్య, పిలుపునిచ్చారు. పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణమరాపు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

కడప ఎడ్యుకేషన్ : నగరంలోని బెల్లంమండి వీధిలోని ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో బుధవారం జేకే యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు ఖాదర్ బాషా మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం చేసేందుకు సరైన ప్లేట్లు, గ్లాసులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతుండడం చూసి సాయం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సేవకులు అబ్దుల్‌నబీ, ఎస్‌ఎండీ రఫీ, ఐఎన్‌టీయూసీ జాకీర్ పాల్గొన్నారు.



'మార్తాండ సూర్యాలయం' నిర్మాత ఎవరు?



ఎం. వెంకటరమణరావు
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల.

మాదిరి ప్రశ్నలు

1. 'కవిరాజ మార్గం'ను అమోఘవర్షుడు ఏ భాషలో రాశాడు?
1) బెంగాలీ 2) సంస్కృతం
3) కన్నడం 4) మరాఠి

2. 'దిల్వారా జైనాలయం' ఎక్కడ ఉంది?
1) రాజస్థాన్ 2) గుజరాత్
3) బెంగాల్ 4) కర్ణాటక

3. కాలచూరుల (హైహయులు) రాజధాని?
1) కనోజ్ 2) త్రిపురి
3) మౌంట్ అబూ 4) ఢిల్లీ

4. గహద్వాల చంద్రదేవుడు విధించిన ప్రత్యేక పన్ను ఏది?
1) పురిటి సుంకం 2) గణాచారి సుంకం
3) పొయ్యి సుంకం
4) తురుష్క దండన సుంకం

5. కింది వాటిలో చాంద్‌బర్దాయ్ హిందీలో రాసిన గ్రంథం?
1) పృథ్వీరాజ్ రాశో 2) రాజస్థాన్ కథావళి
3) నైషధ చరిత్ర 4) శిశుపాల వధ

6. మధ్యప్రదేశ్‌లోని ఖజురహో దేవాలయాన్ని ఎవరు నిర్మించారు?
1) సోలంకీలు 2) చౌహాన్‌లు
3) చందేలులు 4) గహద్వాలులు

7. కింది వాటిలో సరైన జత ఏది?
1) విక్రమశిల విశ్వవిద్యాలయం – ధర్మపాలుడు
2) సోమనాథ దేవాలయం – ప్రభాస్ పఠాన్
3) మిహిర భోజుడు – ప్రతీహార వంశం
4) పైవన్నీ సరైనవే

8. మిహిరభోజుని ఆస్థానాన్ని సందర్శించిన అరబ్బు యాత్రీకుడు ఎవరు?
1) సులేమాన్ 2) అబ్దుల్ రజాక్
3) ఫిరదౌసి 4) లేన్‌పూల్

9. జతపరచండి.

రాజవంశం	రాజధాని
i) చౌహాన్‌లు	a) అన్హిల్‌వాడ్
ii) పరమారులు	b) ఖజురహో
iii) సోలంకీలు	c) గౌర్
iv) చందేలులు	d) ధారానగరం
v) సేన	e) అజ్మీర్

1) i-a, ii-b, iii-c, iv-d, v-e
2) i-e, ii-d, iii-a, iv-b, v-c
3) i-a, ii-d, iii-c, iv-b, v-e
4) i-e, ii-d, iii-a, iv-b, v-c

10. పృథ్వీరాజ్ చౌహాన్ వివాహమాడిన గహద్వాల జయచంద్రుడి కుమార్తె ఎవరు?
1) శీలమహాదేవి 2) సంయుక్త
3) మాచల్దేవి 4) పద్మిని

11. మొదటి తరైన్ యుద్ధం ఏ సంవత్సరంలో జరిగింది?
1) క్రీ.శ. 1191 2) క్రీ.శ. 1192
3) క్రీ.శ. 1193 4) క్రీ.శ. 1194

12. కింది వాటిలో సరికాని జత ఏది?
1) కల్నల్ టాడ్ – రాజస్థాన్ కథావళి
2) షానామా – ఫిరదౌసి
3) జగన్నాథాలయం – భువనేశ్వర్
4) హిందూ జాతీయ వీరుడు – పృథ్వీరాజ్ చౌహాన్

13. చందేవార్ యుద్ధ విజేత ఎవరు?
1) గజనీ మహమ్మద్
2) మహమ్మద్ ఘోరి
3) పృథ్వీరాజ్ చౌహాన్ 4) జయచంద్రుడు

14. 'ముంజేశ్వర' చెరువు ఎక్కడ నిర్మించారు?
1) ధారానగరం 2) ఢిల్లీ
3) అజ్మీర్ 4) జోధ్‌పూర్

15. తమ శీల సంరక్షణకు రాజపుత్ర స్త్రీలు ఆత్మహత్య చేసుకోవడాన్ని ఏమంటారు?
1) జనానా 2) జిజియా
3) జౌహార్ 4) సల్లేఖన

16. 'సమరాంగణ సూత్రధార' గ్రంథాన్ని పరమార భోజుడు ఏ అంశాలపై రాశాడు?
1) వాస్తు అంశాలు 2) రాజనీతి అంశాలు
3) యోగా అంశాలు
4) అలంకారశాస్త్ర అంశాలు

17. 'పంచరత్నాలు' అనే కవులను పోషించిన వారెవరు?
1) మొదటి భీమరాజు 2) లక్ష్మణసేనుడు
3) విజయసేనుడు 4) జయసింహుడు

18. కింది వాటిలో గాంగయ నరసింహదేవుడు నిర్మించిన నిర్మాణం ఏది?
1) సూర్యాలయం (మెంఢోరా)
2) సూర్యాలయం (అల్మోరా)
3) సూర్యాలయం (కోణార్క్)
4) కైలాసనాథాలయం (ఎల్లోరా)

19. టిబెట్‌లో అతిశదీపాంకరుడు ప్రచారం చేసిన బౌద్ధమత శాఖ ఏది?
1) మహాయానం 2) హీనయానం
3) తాంత్రికయానం 4) వజ్రయానం

20. 'జ్ఞానమే మోక్షానికి మార్గం' అని ప్రబోధించిందెవరు?
1) ఆదిశంకరాచార్యులు
2) రామానుజాచార్యులు
3) మధ్వాచార్యులు 4) వల్లభాచార్యులు

21. 'ప్రతీహారులు' అంటే..?
1) శిల్పులు 2) వ్యాపారులు
3) నావికులు 4) ద్వార పాలకులు

22. త్రైపాక్షిక పోరాటం రాష్ట్రకూట, పాల, ప్రతిహార రాజ్యాల మధ్య ఏ భూభాగం కోసం జరిగింది?
1) రాయచూర్ 2) కనోజ్
3) ఢిల్లీ 4) నవద్వీపం

23. కింది వాటిలో సరికాని జత ఏది?
1) కందరీయ మహాదేవాలయం – ఖజురహో
2) గిరిజాదేవి శక్తి పీఠం – కటక్
3) ఉడిపి – కర్ణాటక
4) విఠలాలయం – హంపీ

24. 'రాజతరంగిణి' గ్రంథం ఎవరికి సంబంధించింది?
1) కశ్మీర్ రాజులు 2) సేన రాజులు
3) సోలంకీలు 4) పరమారులు

25. 'భారత చరిత్ర పితామహుడు' ఎవరు?
1) చాంద్‌బర్దాయ్ 2) జె.ఎన్. సర్కార్
3) కల్హణుడు
4) మామిడిపూడి వెంకటరంగయ్య

26. పృథ్వీరాజ్ చౌహాన్ (మూడో పృథ్వీరాజ్) రాణి సంయుక్తను ఏ విధమైన వివాహం చేసుకున్నాడు?
1) స్వయంవర వివాహం



జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ
ప్రత్యేకం

2) రాక్షస వివాహం 3) బ్రహ్మ వివాహం
4) ప్రజాపత్య వివాహం

27. మహమ్మద్ బిన్ ఖాసీం సైన్యాలను ఎదుర్కొన్న దాహిర్ రాజు భార్య పేరు?
1) రాణీబాయి 2) పరిమళదేవి
3) సూరజ్‌దేవి 4) రాణి పద్మిని

28. అరబ్బులు హిందువులు, బౌద్ధులు ఇతర పాలితులను ఏమని వ్యవహరించారు?
1) జిమ్మీలు 2) త్రైవైఫ్‌లు
3) కాఫిర్‌లు 4) మ్లేచ్ఛులు

29. గజనీ మహమ్మద్ ధ్వంసం చేసిన శ్రీ చక్రస్వామి ఆలయం ఎక్కడ ఉంది?
1) కనోజ్ 2) మధుర
3) ముల్తాన్ 4) స్థానేశ్వరం

30. సోమనాథ్ దేవాలయాన్ని గజనీ మహమ్మద్ ఎప్పుడు ధ్వంసం చేసాడు?
1) క్రీ.శ. 1020 2) క్రీ.శ. 1022
3) క్రీ.శ. 1023 4) క్రీ.శ. 1025

31. కింది వాటిలో సరైంది ఏది?
1) కితాబ్-ఉల్-యామ్ని గ్రంథం – ఉత్బి
2) కితాబ్-ఉల్-హింద్ గ్రంథం – అల్‌బెరూనీ
3) బహ్మన్‌నామా గ్రంథం – అజారీ
4) పైవన్నీ సరైనవే

32. గజనీ మహమ్మద్ దండయాత్రను తొలిసారి ఎదుర్కొన్న హింద్‌షాహీ రాజు ఎవరు?
1) జయపాలుడు 2) ఆనందపాలుడు
3) త్రిలోచనపాలుడు 4) భీమపాలుడు

33. ఖజురహోలోని దేవాలయాలను ఏ శైలిలో నిర్మించారు?
1) ఇండో-గ్రీక్ 2) ఇండో-ఆర్యన్
3) ద్రావిడ 4) గోథిక్

34. జతపరచండి.

i) జయనకుడు	a) కుమారపాల చరిత్ర
ii) రాజశేఖరుడు	b) మాలతీ మాధవం
iii) హేమచంద్రుడు	c) ప్రబోధ చంద్రోదయం
iv) భవభూతి	d) పృథ్వీరాజ విజయం
v) ఆనందవర్ధనుడు	e) కర్పూర మంజరీ

1) i-e, ii-a, iii-d, iv-c, v-b
2) i-c, ii-e, iii-b, iv-a, v-d
3) i-d, ii-e, iii-a, iv-b ,v-c
4) i-b, ii-c, iii-a, iv-e, v-d

35. కశ్మీర్‌లోని 'మార్తాండ సూర్యాలయం' నిర్మాత ఎవరు?
1) హరిసింగ్
2) లలితాదిత్య ముక్తాపీడుడు
3) బాలాదిత్య 4) జయపాలుడు

36. 'శిలా నిర్మిత సుందరనగరం' అని దేన్ని పిలిచేవారు?
1) ఉదయ్‌పూర్ 2) భగత్‌పూర్
3) జైపూర్ 4) జోధ్‌పూర్

37. 'ఖండన ఖండఖాద్యం' గ్రంథకర్త ఎవరు?
1) శ్రీహర్షుడు 2) దండి
3) పద్మగుప్తుడు 4) కల్హణుడు

38. ప్రతీహారులు తాము ఎవరి సంతతికి చెందిన వాళ్లమని చెప్పుకొన్నారు?
1) ఇంద్రుడు 2) లక్ష్మణుడు
3) వరుణుడు 4) బ్రహ్మ

39. విద్యాధరుడు అనే రాజు ఏ వంశానికి చెందినవాడు?
1) ఛంధేల 2) సోలంకీ
3) పాల 4) పరమార

40. 'అరబ్బుల సింధూపై దండయాత్ర ఫలితం లేని విజయం' అని అన్నదెవరు?
1) జె.ఎన్. సర్కార్
2) రాధాకుముద్ ముఖర్జీ
3) లేన్‌పూల్ 4) వి.ఎ. స్మిత్

41. హర్షుడి పాలనాకాలం ఏది?
1) క్రీ.శ. 606 - 647
2) క్రీ.శ. 606 - 656
3) క్రీ.శ. 606 - 666
4) క్రీ.శ. 600 - 647

42. 'సూర్య శతకం' రాసిందెవరు?
1) బాణుడు 2) మతంగ దివాకరుడు
3) భర్తృహరి 4) మయూరుడు

43. కింది వాటిలో సరికాని జత?
1) యాత్రికుల్లో యువరాజు – హుయాన్‌త్సాంగ్
2) మహామోక్ష పరిషత్ – స్థానేశ్వరం
3) నలంద విశ్వవిదాలయం – రాజ్‌గిర్
4) కాదంబరి గ్రంథం – బాణుడు

44. హర్షుడి తొలి రాజధాని ఏది?
1) కనోజ్ 2) ఉజ్జయిని
3) శ్రీనగర్ 4) స్థానేశ్వరం

45. కింది వాటిలో హుయాన్‌త్సాంగ్ రచన ఏది?
1) నేచురల్ హిస్టరీ 2) ది ట్రావెల్స్
3) సి-యూ-కి 4) ఫో-కో-కి

46. 'సకలోత్తరాపథేశ్వరుడు' అనేది ఎవరి బిరుదు?
1) భాస్కర వర్మ 2) రెండో పులకేశి
3) రెండో ధ్రువసేనుడు 4) హర్షుడు

47. హర్షుడి వంశం ఏది?
1) పుష్యభూతి 2) పశ్చిమ చాళుక్య
3) ప్రతీహార 4) గహద్వాల

48. కింది వాటిలో హర్షుడి రచన కానిది ఏది?
1) నాగానందం 2) చండీ శతకం
3) రత్నావళి 4) ప్రియదర్శిక

49. రెండో పులకేశి, హర్షుడి రాజ్యాల సరిహద్దుగా ఉన్న నది ఏది?
1) యమున 2) గోమతి
3) నర్మద 4) కావేరి

50. 'రాజశ్రీ' ఎవరు?
1) హర్షుడి తల్లి 2) హర్షుడి కుమార్తె
3) హర్షుడి సోదరి 4) హర్షుడి పినతల్లి

51. కింది వాటిలో సరైన జత ఏది?
1) మహామోక్ష పరిషత్ – ఐదేళ్లకోసారి
2) ప్రభాకర వర్ధనుడు – హూణ హరిణ కేసరి
3) గృహవర్మ – మౌఖరి వంశం
4) పైవన్నీ సరైనవే

52. జతపరచండి.
పదజాలం
i) రాజస్తానీయ
ii) మహాబలాధీకృత
iii) భాండాగారాధీకృత
iv) తుల్యమేయ
v) ధ్రువాధికరణ
అర్థం
a) కోశాధికారి
b) అమ్మకం పన్ను
c) పన్ను వసూలు చేసే అధికారి
d) సేనాపతి
e) విదేశీ వ్యవహారాలు
1) i-e, ii-d, iii-c, iv-b, v-a
2) i-e, ii-b, iii-c, iv-d, v-a
3) i-c, ii-d, iii-a, iv-b, v-e
4) i-e, ii-d, iii-a, iv-b, v-c

53. సి-యూకి గ్రంథం ప్రకారం, క్రీ.శ. 7వ శతాబ్దంలో భారతీయులు ఏం తినరని పేర్కొన్నారు?
1) ఉల్లి, వెల్లుల్లి
2) మిరపకాయ, కందిపప్పు
3) అల్లం, మెంతులు
4) పెసరపప్పు, మినప పప్పు

54. కనోజ్‌లో జరిగిన సర్వమత మహాసభ అధ్యక్షుడెవరు?
1) భాస్కర వర్మ 2) హుయాన్‌త్సాంగ్
3) తాయిసుంగ్ 4) గౌడశశాంకుడు

55. 'దానధర్మ క్షేత్రం' అని ఏ ప్రాంతాన్ని పిలుస్తారు?
1) కనోజ్ 2) అజ్మీర్
3) ప్రయాగ 4) శ్రీనగర్

56. హర్షుడి తండ్రి ఎవరు?
1) ఆదిత్య వర్ధనుడు 2) రాజ్య వర్ధనుడు
3) ప్రభాకర వర్ధనుడు
4) భాస్కర వర్మ

57. కింది వాటిలో సరైన జత ఏది?
1) యశోమతీదేవి – హర్షుడి తల్లి
2) కామరూప – అసోం
3) సోమోద్భవ – నర్మదా నది
4) పైవన్నీ సరైనవే

సమాధానాలు

1) 3	2) 1	3) 2	4) 4	5) 1
6) 3	7) 4	8) 1	9) 2	10) 2
11) 1	12) 3	13) 2	14) 1	15) 3
16) 1	17) 2	18) 3	19) 4	20) 2
21) 4	22) 2	23) 2	24) 1	25) 3
26) 2	27) 1	28) 1	29) 4	30) 4
31) 4	32) 1	33) 2	34) 3	35) 2
36) 4	37) 1	38) 2	39) 1	40) 3
41) 1	42) 4	43) 2	44) 4	45) 3
46) 4	47) 1	48) 2	49) 3	50) 3
51) 4	52) 4	53) 1	54) 2	55) 3
56) 3	57) 4			



పి. నీలకంఠయ్య
జెడ్‌పీహెచ్‌ఎస్,
కమ్మకండ్రిగ,
చిత్తూరు జిల్లా.

టెన్త్ బయాలజీ సీసీఈ విధానంలో..

పదో తరగతి బయాలజీ ప్రత్యేకం

పిల్లల సంపూర్ణ వికాసానికి విద్య తోడ్పడాలనే లక్ష్యంతో రాష్ట్రంలో నిరంతర సమగ్ర మూల్యాంకనం (సీసీఈ)ని అమలు చేస్తున్నారు. విద్య ద్వారా పిల్లల్లో మానసిక పరిపక్వతతోపాటు స్నేహం, సహకారం, సహనశీలత, ఓర్పు వంటి వైఖరులు అలవడాలి. వారిలో తార్కిక వివేచన, సృజనాత్మక ఆలోచనలు పెంపొందాలి. సమస్యలకు కుంగిపోకుండా ఎదురునిలిచి వాటిని పరిష్కరించే నేర్పు రావాలి. వీటన్నింటి కోసం సీసీఈని ప్రవేశపెట్టారు. ఈ విధానంలో కేవలం పిల్లలకు పరీక్షలు పెట్టడం మాత్రమే కాకుండా వారి జ్ఞానాత్మక, మానసిక చలనాత్మక, భావావేశ నైపుణ్యాలను పెంపొందించడం ఉంటుంది. ఈ మూల్యాంకనం రెండు రకాలు. అవి..

1) నిర్మాణాత్మక మూల్యాంకనం - ఫార్మేటివ్ అసెస్‌మెంట్
2) సంగ్రహణాత్మక మూల్యాంకనం - సమ్మేటివ్ అసెస్‌మెంట్

నిర్మాణాత్మక మూల్యాంకనం: ఇది అంతర్గత మూల్యాంకనం. విద్యార్థి సామర్థ్యాలను, సాధన స్థితిగతులను అంచనా వేసేందుకు, అభ్యసనాన్ని మెరుగుపర్చడానికి ఈ మూల్యాంకనం సహాయపడుతుంది. తరగతి గదిలో జరిగే చర్చలు, పిల్లల ప్రతిస్పందనలు, పిల్లలు రాసిన నోటు పుస్తకాలు, తరగతి పని, ఇంటిపని, ప్రాజెక్ట్ పనులు, ప్రయోగశాల కృత్యాలు వంటి అంశాల ఆధారంగా ఈ అధ్యయనాన్ని నిర్వహిస్తారు. ఇందులో నాలుగు రకాల సాధనాలను ఉపయోగిస్తారు.

జీవ, భౌతిక, రసాయన శాస్త్రాలు

1) రాత అంశాలు - 10 మార్కులు
2) ప్రాజెక్ట్ పనులు-10 మార్కులు
3) ప్రయోగశాల పనులు - 10 మార్కులు
4) లఘు పరీక్ష-20 మార్కులు. పై సాధనాల ద్వారా సాధించిన గ్రేడ్‌లను నమోదు చేయాలి.

జీవశాస్త్రంలో ఫార్మేటివ్ అసెస్‌మెంట్ నిర్వహణ:

విద్యార్థులు రెండు లాంగ్‌సైజ్ నోట్‌బుక్‌లు తీసుకోవాలి. ఒకదానిలో తరగతి గది రాత పని, మరొకదానిలో ప్రాజెక్ట్ పని, ప్రయోగశాల నివేదిక, లఘు పరీక్షను రాయాలి.

1. రాత పనులు - నోటు పుస్తకాలు: పిల్లలు తాము అవగాహన చేసుకున్న అంశాన్ని సొంత మాటలతో వ్యక్తీకరించడానికి, భావాన్ని లిఖిత రూపంలో తెలియజేయడానికి లేఖనా నైపుణ్యం అవసరమని మనకు తెలుసు. ఇందు కోసం నోటు పుస్తకాలు ఉపయోగపడతాయి. వీటిలో పిల్లలు ప్రశ్నలకు జవాబులను సొంత మాటల్లో రాయాలి. దీనివల్ల పిల్లల్లో భావనల పట్ల స్పష్టత వస్తుంది. రాత పనికి పది మార్కులుంటాయి. ఉపాధ్యాయుడు కింది అంశాల ఆధారంగా మార్కులు కేటాయించాలి.

1) సొంతంగా రాసినదై ఉండటం
2) బొమ్మలు గీసి ఉండటం
3) భాషాదోషాలు లేకుండా ఉండటం.

2. ప్రాజెక్ట్ పని: పాఠ్య పుస్తకంలో ప్రతి పాఠం మధ్యలో కొన్ని ప్రాజెక్టులు ఇచ్చారు. వీటితోపాటు స్థానిక వనరులు, అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయుడు సొంతంగా కొన్ని ప్రాజెక్ట్‌లు తీసుకోవచ్చు.

ప్రతి ఫార్మేటివ్ కాలంలో ఒక ప్రాజెక్ట్‌ను తప్పనిసరిగా చేయాలి. పాఠంలో ఇచ్చిన కృత్యాలు ప్రాజెక్ట్‌లు కావు. ప్రాజెక్ట్‌లో ఒక సమస్య పరిష్కారం కోసం వేర్వేరు సాధనలు ఉపయోగించి సమాచారాన్ని సేకరించి విశ్లేషించాలి. చివరకు నిర్ధారణకు రావాలి. ప్రాజెక్ట్‌ని వ్యక్తిగత, జట్టు ప్రాజెక్ట్ పనిగా ఇవ్వాలి. ఇంటర్వ్యూ చేయడం, సమాచార సేకరణ, పరిశోధన గ్రంథాలు, రిఫరెన్స్ పుస్తకాలు చదవడం ద్వారా ప్రయోగాలు చేయడం, వస్తువును, నమూనాను తయారు చేయడం కూడా ప్రాజెక్ట్‌లో భాగమే. ప్రాజెక్ట్‌లో రెండు ప్రధానాంశాలుంటాయి. అవి...

1) ప్రాజెక్ట్‌కు సిద్ధం కావడం, నిర్వహించడం.
2) ప్రాజెక్ట్ నివేదిక రాయడం.

కింది అంశాలు ప్రాజెక్ట్ నివేదికలో ఉండాలి.

1) ప్రాజెక్ట్ పేరు/సమస్య/ప్రశ్న
2) లక్ష్యాలు
3) ఎంచుకునే సాధనాలు/అధ్యయనం చేయడం
4) అధ్యయన పద్ధతి
5) విషయ విశ్లేషణ - పట్టికలు
6) ముగింపు 7) ఉపయోగించిన వనరులు
8) కృతజ్ఞతలు

విద్యార్థులు ఉపయోగించిన సాధనాలు, ప్రాజెక్ట్ నిర్వహణ తీరును బట్టి మార్కులు కేటాయిస్తారు. జట్టుగా ప్రాజెక్ట్‌ను నిర్వహించినా వ్యక్తిగతంగా ప్రతి విద్యార్థి మొత్తం నివేదికను ఫార్మేటివ్ నోట్స్‌లో రాయాలి.

3. విద్యార్థి ప్రతిస్పందనలు, ప్రయోగశాల పనులు/రికార్డ్ నిర్వహణ

విజ్ఞాన శాస్త్రాన్ని నేర్చుకోవడంలో ప్రయోగాల నిర్వహణ ముఖ్యమైంది. విద్యార్థులు ప్రయోగశాలలో చేసిన ప్రయోగ విధానాన్ని, సాధించిన ప్రక్రియ నైపుణ్యాలను మదింపు చేయాలి. ఇందుకోసం పరికరాల అమరికలో వారు ప్రదర్శించే నైపుణ్యం, పరిశీలనల నమోదు, ఫలితాల విశ్లేషణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. అదే విధంగా ప్రయోగాలు చేసిన తర్వాత నివేదిక రూపంలో దాన్ని ఫార్మాట్ మూల్యాంకనం నోట్స్‌లో రాయాలి.

ల్యాబ్ రికార్డ్‌లో ఉండాల్సిన అంశాలు..

ఉద్దేశం, కావాల్సిన పరికరాలు, ప్రయోగ విధానం, పరిశీలనలు/ నమోదు, ఫలితాల విశ్లేషణ, సాధారణీకరణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు ప్రయోగం చేసిన పద్ధతికి 4 మార్కులు, ప్రయోగశాల రికార్డుకు 6 మార్కులు మొత్తంగా పది మార్కులు కేటాయిస్తారు.

4. లఘు పరీక్ష (స్లిప్ టెస్ట్): పాఠాన్ని బోధించిన తర్వాత విషయావగాహన ఏ మేరకు జరిగిందో ఎప్పటికప్పుడు అంచనా వేసుకోవడం కోసం పరీక్షను నిర్వహించాలి. నిర్దేశించిన సమయంలో కాకుండా పరీక్ష అనే భావన కలగకుండా ఏ సమయంలోనైనా పరీక్షను నిర్వహిస్తారు. ఇది సాధారణ యూనిట్ పరీక్ష వంటిది కాదు. ఇది 20 మార్కులకు జరుగుతుంది. దీన్ని కూడా ఫార్మేటివ్ నోట్స్‌లోనే రాయాలి. విద్యా సంవత్సరంలో నాలుగుసార్లు ఈ పరీక్ష నిర్వహిస్తారు.

సంగ్రహణాత్మక మూల్యాంకనం: బోధనాభ్యసన ప్రక్రియల ద్వారా విద్యార్థి నేర్చుకున్న అంశాలను మొత్తంగా మూల్యాంకనం చేయడమే సంగ్రహణాత్మక మూల్యాంకనం. ఏడాదిలో మూడుసార్లు అంటే SA-I, SA-II, SA-III (పబ్లిక్) పరీక్షలు నిర్వహిస్తారు. నిర్దేశిత విద్యా ప్రమాణాల ఆధారంగా వెయిటేజ్‌ను నిర్ణయించి పరీక్షను నిర్వహిస్తారు.

పై ప్రమాణాల ఆధారంగా దీర్ఘ సమాధాన ప్రశ్నలు, లఘు రూప, స్వల్ప సమాధాన, బహుళైచ్ఛిక రూపంలో ప్రశ్నలు వస్తాయి. భాషేతర అంశాలైన గణితం, విజ్ఞానశాస్త్రం, సాంఘిక శాస్త్రంలో ప్రశ్నల స్వరూపం, సంఖ్య ఇదే విధంగా ఉంటుంది. కేవలం 4 మార్కుల ప్రశ్నలకు అంతర్గత చాయిస్ ఉంటుంది. మిగిలిన ప్రశ్నలన్నింటినీ విద్యార్థి తప్పకుండా రాయాలి. చాయిస్ ఉండదు.

సైన్స్‌లో విద్యా ప్రమాణాల వారీగా వెయిటేజ్

విద్యా ప్రమాణాలు	వెయిటేజీ	మార్కులు
విషయావగాహన	40%	16
ప్రశ్నించడం, పరికల్పనలు చేయడం	10%	4
ప్రయోగాలు, క్షేత్ర పరిశీలనలు	15%	6
సమాచార నైపుణ్యాలు	15%	6
బొమ్మలు గీయడం ద్వారా భావ ప్రసారం	10%	4
నిజ జీవిత వినియోగం, ప్రశంస	10%	4

ప్రశ్న రకం	ప్ర. సం.	మార్కులు	మొత్తం
స్వల్ప సమాధానం	4	4	4×4=16
లఘురూపం	5	2	5×2=10
దీర్ఘ సమాధాన ప్రశ్నలు	4	1	4×1=4
బహుళైచ్ఛికం	20	1/2	20×1/2=10

The validity of the GST registration?



K
Director,
DBS, Hyderabad

B POs, Clerks Special

M

1 . man maThe BankingPrimary Ombudsealers
reject a complaint at any stage if it appears to him that a complaint made to him ____:
a) If the Compensation sought from the Banking Ombudsman is beyond Rs. 20 lakh
b) If it requires consideration of elaborate documentary and oral evidence
c) If the proceedings before the Banking Ombudsman are not appropriate for adjudication of such complaint
d) If the complaint is without any sufficient cause
e) All the above

2 . ing set upWho6among the follow . PriorityAs per
the Credit Guarantee Fund Trust for Micro and Small Enterprises (CGTMSE)?
a) GOI
b) Ministry of MSME
c) SIDBI d) a & c
e) Reserve Bank of India

3 . wing canWho among the follo
issue Commercial Paper(CP)?
a) Corporates
b) Primary Dealers
c) All India Financial Institutions
d) a, b, & c e) a & b only

4 . d balanceAs per the latest audited
sheet, If the tangible net worth of the company is not less than ______ crore, then the corporate would be eligible to issue CP.
a) 4 b) 3 c) 2
d) 5 e) None of these

5 . unt notCompensation amount
exceeding Rs. _____ lakh to the complainant for mental agony and harassment may be awarded by Banking Ombudsman.
a) 1 b) 2 c) 3
d) 5 e) None of these

6 . Priority Sector guidelines Which of the following categories are there?
a) Export Credit b) Agriculture
c) Social Infrastructure
d) Renewable Energy
e) All of these

7 . 500 willCurrency note of Rs.
have ' five bleed lines on left and right in raised print'. Similarly how many bleed lines are there on the left and right in Rs. 2000 currency note?
a) 3 b) 4 c) 6 d) 7 e) 8

8 . forms areWhich of the following
used for Acknowledgement of registration for GST?
a) Form GSTR -1
b) Form GSTR -2
c) Form GST REG-02
d) Form GST REG
e) None of these

9 . N CARDIf the fourth letter of PA
is 'P' then it denotes _____:
a) Company b) Firm
c) Person d) Trust
e) HUF

10 registra-
tion certificate is:
a) One year b) Two years
c) Five years
d) Valid till it is canceled
e) None of these

11 nsUnion
CIBIL is located in _________ :
a) Chennai b) Kolkatta
c) Mumbai d) Bengaluru
e) None of these

12 a Non-
Banking Finance Company should be Rs.______ to get the NBFC license from RBI.
a) 100 Lakh b) 150 Lakh
c) 200 Lakh d) 250 Lakh
e) None of these

13 ds for: In NRE account "R" stan
a) Residential b) Recoverable
c) Resident d) Residual
e) None of these

14 our-year business plan embarked by the
Government of India for providing rural infrastructure in the areas of:
a) Irrigation & water supply
b) Electrification c) Housing
d) Telecommunication & connectivity
e) All the above


15 . The Headquarters of Tra
a) National & International Exchange of India
b) National Internet Exchange of India
c) National Inter Exchange Interest
d) None of the above Net Owned Funds of
e) National Industrial Exchange of India

K

1) e	2) d	3) d	4) a
5) a	6) e	7) d	8) c
9) c	10) b	11) c	12) c
13) c	14) e	15) b	16) c

గుర్తించండి

raft
hike
kiwi
branch
sweater
teacher
lolipop
log



b	p	b	i	h	t	h	b	b
r	g	r	k	w	n	i	w	r
e	l	a	z	m	f	k	j	a
h	o	n	a	v	o	e	o	f
c	g	c	p	b	n	u	p	t
a	v	h	j	g	q	z	t	u
e	c	n	z	t	i	w	i	k
t	r	e	t	a	e	w	s	t
i	l	o	l	i	p	o	p	j

పైన ఇచ్చిన బొమ్మల పేర్లు పజిల్‌లో ఎక్కడ ఉన్నాయో గుర్తించండి

దారి కనుక్కోండి

తన స్నేహితులతో కలిసి వచ్చిన వంకాయ తప్పిపోయింది. తన స్నేహితుల వెళ్లడానికి దారి చూపిస్తారా?



నాన్నా చెప్పవా?

పెంగ్విన్లు సముద్రంలో ఎలా ఉండగలుగుతాయి?




మన భూగోళం మీద, మంచుతో నిండిన అంటార్కిటికా ప్రాంతంలో నివసించే పెంగ్విన్లు అద్భుతమైన డైవర్లనీ, గజఈతగాళ్ళనీ వర్ణించ వచ్చు. ఇవి సముద్రంలో 500 మీటర్ల లోతు దాకా వెళ్లడమే కాకుండా, పైకి రాకుండా సుమారు 15 నిమిషాల దాకా నీటిలోపల ఉండ గల్గుతాయి. ఇందుకు ఒక ముఖ్య కారణమే ఉంది లెండి.

పెంగ్విన్ల శరీర ఉష్ణోగ్రత సాధారణంగా 38 డిగ్రీల సెల్సియస్ వుంటుంది. అయితే ఇవి సముద్రం లోపలికి దిగాక వాటి ఉష్ణోగ్రత 11 డిగ్రీలకు పడిపోతుంది. దాంతో వాటి శరీరం లోపలి కణజాలాలన్నీ తమ తమ జీవన చర్యల వేగాన్ని తగ్గిస్తాయి. అంటే వాటికి అవసరమైన ఆమ్లజని వేగాన్ని తగ్గిస్తాయి. అంటే వాటికి ఆవసరమైన ఆక్సిజన్ కూడా గణనీయంగా తగ్గిపోతుందన్నమాట. ఈ కారణంగా అవి అంతకు ముందు పీల్చుకున్న గాలిలోని ఆక్సిజన్ సాయంతో సుమారు 15 నిమిషాల దాకా నీటి లోపల ఉండగల్గుతాయి.


ఒకవేళ సముద్రం లోపలికి వెళ్ళాక వాటి శరీర ఉష్ణోగ్రత పడిపోయి తద్వారా జీవన చర్యలు మందగించకుండా ఉన్నట్లయితే పెంగ్విన్లు అంతసేపు నీటిలో ఉండటం అసాధ్యమవు తుంది. ఎందుకంటే వాటి శరీరానికి.... పావుగంట సేపు బతికేందుకు కావలసిన ఆక్సిజన్‌ని తమలో నిలుపుకోగలిగే సామర్థ్యం వుండదు.

కింది రెండు బొమ్మల మధ్య ఉన్న 8 తేడాలను గుర్తించండి



నీడను గుర్తించండి

పక్కన ఇచ్చిన 5 నీడల్లో ఈ జంతువు అసలు నీడ ఏదో గుర్తించండి



కనుక్కోండి



నిజం!


డచ్ దేశస్తులు ఏడాదికి సగటున వెయ్యి కిలోమీటర్లు ప్రయాణిస్తారు




ప్రపంచ దేశాలతో పోల్చినపుడు చైనాలో ఉరిశిక్షలు 4 రెట్లు అధికం



కింద ఇచ్చిన బొమ్మను పక్కన ఉన్న ఖాళీ గళ్లలో గీసి రంగులు వేయండి



రంగులు వేయండి





సింహ వాహనంపై శ్రీరంగనాథుడు

పులివెందుల పట్టణంలోని అతి ప్రాచీన ఆలయం అయిన శ్రీరంగనాథస్వామి ఆలయంలో నూలుపూజ పవిత్రోత్సవాల్లో భాగంగా 5వ రోజు స్వామివారు సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు కృష్ణరాజేష్ శర్మ ఉభయదారులచే ప్రత్యేక పూజలు జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

– పులివెందుల టౌన్

ఆదర్శ వనిత.. ఆరోగ్యమాత

కడప కల్చరల్ :

ఆరోగ్యమాత లోకానికి ఆదర్శ వనితగా నిలిచిందని సిద్దవటం ఆనందాశ్రమం ఫాదర్ ఫ్రాన్సిస్ పేర్కొన్నారు. కడప నగరం రైల్వేస్టేషన్ వద్దగల ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో నవదిన ఉత్సవాల్లో భాగంగా రెండవరోజు బుధవారం నిర్వహించిన ఆధ్యాత్మిక సభకు ఆయన ప్రధాన వక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన 'ఆధునిక లోకానికి ఆదర్శ వనిత' అనే అంశంపై ప్రసంగించారు. లోకానికి ప్రేమ, నీతి, శాంతి అందించి అసమానతలను తొలగించేందుకు ప్రభువైన క్రీస్తును లోకానికి అందించిన తల్లి మరియమాత పరిశుద్ధురాలని, పవిత్రురాలని వివరించారు. క్రీస్తు ద్వారా మనం పొందుతున్న ఆశీర్వాదాలకు, తృప్తికరమైన జీవితానికి ఆ తల్లియే కారణమన్నారు. అందుకే ఆమెను లోకానికి తల్లిగా



సందేశం అందిస్తున్న ఫాదర్ ఫ్రాన్సిస్

భావిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. తొలుత ఆరోగ్యమాత స్వరూపాన్ని అందమైన తేరుపై అలంకరించి పాతగుడి చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ కన్నా జయన్న, సహాయ గురువులు ఫాదర్ రాజన్న, డీకన్ ప్రభుకుమార్, ఆరోగ్యమాత సభ సిస్టర్లు, తిరుణాల కమిటీ సభ్యులు, విశ్వాసులు ఈ ప్రదక్షిణలో పాల్గొన్నారు. భక్తి గీతాలను ఆలపిస్తూ సాగారు. పులివెందుల లయోల కళాశాల ఫాదర్ వై ఇన్నారెడ్డి దివ్య



తేరుపై అలంకారంలో ఆరోగ్యమాత

బలి పూజ సమర్పించారు. కార్యక్రమంలో ఆయనతోపాటు ఫాదర్ ఫ్రాన్సిస్‌ను పుణ్యక్షేత్రం నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

రేపు విజయవాడలో ఆందోళన

కడప కోటిరెడ్డి సర్కిల్ :

జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న విజయవాడలో సీపీఎస్ విధానంపై మిలినియన్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు జేఏసీ చైర్మన్ కే శివారెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ఆ సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో పని చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లు, సీపీఎస్ ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలన్నారు. పోరాడితే తప్ప ఈ ప్రభుత్వం స్పందించదన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు ఇలియాస్, యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు లక్ష్మిరాజా, మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు నిర్మల జ్యోతి, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జయలక్ష్మి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి చెన్నారెడ్డి, రామ్మూర్తి నాయుడు, ఏపీ ఎన్జీఓల ఇరిగేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ పూల్ ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ ప్రశాంతం

కడప ఎడ్యుకేషన్ :

ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయు బదిలీల్లో భాగంగా ఆబ్‌సెంట్‌తోపాటు స్థానాలు లేక డీఈఓ పూల్‌లో మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీలకు బుధవారం సాయంత్రం నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సంబంధిత కౌన్సెలింగ్‌ను జిల్లా విద్యాశాఖ కార్యాలయ సభాభవన్‌లో డీఈఓ పొన్నతోట శైలజ అధ్వర్యంలో నిర్వహించారు. గతంలో నిర్వహించిన బదిలీల కౌన్సెలింగ్‌లో సరైన స్థానం కోసం అబ్‌సెంట్ అయి డీఈఓ పూల్‌లోకి వెళ్లిన ఎస్‌జీటీనే మళ్లీ డీఈఓ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు కూడా అబ్‌సెంట్ అయినట్లు తెలిసింది. దీనిపై డీఈఓ కార్యాలయంలో కొంత చర్చ చోటుచేసుకుంది. డీఈఓ కార్యాలయంలో జరిగిన బదిలీల కౌన్సెలింగ్‌లో కూడా 12.5 హెచ్‌ఆర్‌ఏ పరిధిలోకి బదిలీలు చేయడంతో సరైన స్థానం రాదని తెలుసుకుని ఈ కౌన్సెలింగ్‌కు కూడా అబ్‌సెంట్ అయినట్లు సమాచారం.



బదిలీల కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్న డీఈఓ కార్యాలయ సిబ్బంది

బదిలీల తర్వాత రెకమండేషన్‌తో గవర్నంట్ అర్డర్‌ను తెచ్చుకోనున్నట్లు తెలిసింది.

114 మందికి కౌన్సెలింగ్

డీఈఓ పూల్‌లో మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీలకు సంబంధించిన 114 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. సోషియల్ స్కూల్ అసిస్టెంట్ 7 మందికి, బయాలజీకి సంబంధించి 5 మందికి, మ్యాథ్స్ ఒకరు అలాగే ఎస్‌జీటీకి సంబంధించి 43 మందికి, ఎల్‌పీ హిందీ జెడ్పీకి సంబంధించి 12 మందికి గవర్నమెంట్ ఒకరు. ఎల్‌పీ తెలుగు జెడ్పీలో 17 మందికి గవర్నమెంట్‌లో 6 మందికి, అలాగే పీఈటీలకు సంబంధించి 22 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీ వరలక్ష్మి, సూపరింటెండెంట్ ఏకాంబరం, డీఈఓ కార్యాలయ సిబ్బంది బ్రహ్మానందరెడ్డి, నాగేశ్వరెడ్డి, రెహమన్, ఏసన్న, బాబునాయక్, ఎంఈఓలు పాలెం నారాయణ, జాఫర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

2నుంచి సిలంబం రాష్ట్రస్థాయి పోటీలు

- 13 జిల్లాల క్రీడాకారుల రాక
- ఏపీ సిలంబం అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ శివకృష్ణమూర్తి



మాట్లాడుతున్న వై శివకృష్ణమూర్తి

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో రాష్ట్రస్థాయి సిలంబం (కర్రసాము) పోటీలను నిర్వహిస్తున్నట్లు ఏపీ సిలంబం అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ వై శివకృష్ణమూర్తి పేర్కొన్నారు. నగరంలోని అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 2, 3 తేదీల్లో సిలంబం పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన వివరించారు. ప్రాచీన క్రీడలు నేడు ఆధునికతను సంతరించుకుని మళ్లీ ఆదరణ పొందుతున్నాయన్నారు. సిలంబం అసోసియేసన్ జిల్లా కమిటీ ప్రతినిధులు దామోదర్‌రాజు, కే వెంకటేష్, మస్తాన్, రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు ఈ పోటీల్లో సత్తాచాటి పతకాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి పోటీలను తొలిసారిగా జిల్లాలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అందరి సహకారంతో రాష్ట్రస్థాయి పోటీలను విజయవంతం చేస్తామని వారు పేర్కొన్నారు.

55వ రోజుకు చేరిన ఆర్‌సీపీ దీక్షలు



ఉక్కు దీక్షలో గీతాంజలి నర్సింగ్ విద్యార్థులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోటిరెడ్డి సర్కిల్‌లో ఆర్‌సీపీ చేపట్టిన వంద రోజుల దీక్షలు బుధవారానికి 55వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా తయ్యాబ్ పాలిటెక్నిక్ కళాశాల కరస్పాండెంట్ ఆజామ్ మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదన్నారు. బుధవారం దీక్షకు గీతాంజలి నర్సింగ్ కళాశాల విద్యార్థులు మద్దతిచ్చారు. ఈ సందర్భంగా దీక్షలను ఆజామ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాపై వివక్ష చూపడం సరికాదన్నారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటులో చంద్రబాబుకు చిత్తశుద్ధి కరువు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయడంలో చంద్రబాబుకు చిత్తశుద్ధి కరువైందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ నారాయణ పేర్కొన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలంటూ నగరంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో సీఐటీయూ, ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ, ఆర్డీఎఫ్ ఆధ్వర్యంలో 24 గంటల దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీ నారాయణ

మాట్లాడుతూ కడప జిల్లా వెనుకబాటుకు గురైందని, కనీసం ఈ ప్రాంతంలో రైతులు కరువుతో అల్లాడుతుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టించుకున్న దాఖలాల్లేవని విమర్శించారు. రాష్ట్ర విభజన చట్టంలో జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ఆనాడు పార్లమెంట్, అసెంబ్లీలో పేర్కొన్న కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని టీడీపీ జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు సహకరించకపోవడం సరికాదని విమర్శించారు. జిల్లాలో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాల్లేక ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లి, అక్కడ కష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి గురించి రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జిల్లా అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఉక్కు పరిశ్రమ తీసుకొచ్చారన్నారు. అయితే అనంతరం వచ్చిన పాలకులు ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేయకపోవడం బాధకరమన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయని పక్షంలో ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు జగదీష్, నరసింహ, అన్వేస్, లక్ష్మీదేవి, మరియమ్మ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



సిద్దవటంరోడ్డులో సుందరంగా అలంకరించిన ప్రవేశద్వారం




తోటోత్సవంలో భాగంగా ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న సిద్దవటంరోడ్డులోని గణనాథుడు

అద్భుతం.. తోటోత్సవం

బద్వేలు అర్బన్ : వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని సిద్దవటం రోడ్డులో వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద, నాలుగు రోడ్ల కూడలిలో ఆర్యవైశ్య వర్తక సంఘం ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల వద్ద బుధవారం ఏర్పాటు చేసిన తోట ఉత్సవం స్వర్గం భువికి దిగి వచ్చినట్లుగా కనుల పండువగా సాగింది. తోటోత్సవంలో భాగంగా ఆయా మండపాలలోని స్వామి వారి ముందు వివిధ రకాల మొక్కలు, చెట్లను ఏర్పాటు చేసి అందులో వివిధ రకాల దేవతామూర్తులు, విగ్రహాలను ఏర్పాటు చేశారు.

- సిద్దవటం రోడ్డులోని మండపంలో రథంపై ఏర్పాటు చేసిన శివపార్వతుల ప్రతిమలు, బ్రహ్మ, విష్ణుమూర్తుల ప్రతిమలు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.
- నాలుగు రోడ్ల కూడలిలోని మండపంలో ఆకర్షణీయంగా తయారు చేసిన పందిరిలో వెంకటేశ్వరస్వామి, లక్ష్మిదేవిల విగ్రహాలు చూపరులను ఆకర్షించాయి. అలాగే ఇక్కడ వినాయకస్వామి తులాభారం నిర్వహించడంతో పాటు పవళింపు సేవ నిర్వహించారు.



సిద్దవటంరోడ్డులో రథంపై దర్శనమిస్తున్న దేవతామూర్తులు



నాలుగు రోడ్ల కూడలిలో ఆకర్షణీయంగా తయారుచేసిన పందిరిలో దర్శనమిస్తున్న శ్రీనివాసుడు

ఫ్యాక్షన్ గ్రామంలో.. శాంతి కుసుమాలు

- నాడు ఫ్యాక్షన్ గ్రామం.. నేడు ఆదర్శ గ్రామం
- దుంపల గట్టులో పూల సిరులు
- పూల సాగులో ఖాజీపేట మండలానికే ఆదర్శం
- ఆర్థిక పురోగతి చెందిన రైతులు...

ఒకప్పుడు ఫ్యాక్షన్ గ్రామంగా ముద్రపడ్డ గ్రామం దుంపలగట్టు ... రాజకీయ కక్షల వల్ల మండలంలో పనిచేసే అధికారులు, పోలీసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు... ఫ్యాక్షన్ ఘర్షణల వల్ల గ్రామంలో ఎలాంటి అభివృద్ధి లేక ప్రజలకు సంక్షేమ ఫలాలు అందక ఇబ్బందులు పడ్డారు. కానీ నేడు ఆ గ్రామంలో మచ్చుకైనా ఘర్షణ లేకుండా ప్రశాంత జీవనం గడుపుతున్నారు. రైతులంతా కలసి అన్ని రకాల పంటలు సాగుచేసుకుంటూ పచ్చని పంట పొలాలతో గ్రామం కళకళలాడేలా చేసుకున్నారు. ముఖ్యంగా పూల సాగుతో అన్నదాతలు ఆర్థిక పురోగతి వైపు అడుగులు వేస్తున్నారు. ఫ్యాక్షన్ గ్రామంలో శాంతి కుసుమాలు పూయిస్తున్నారు. ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఖాజీపేట: ఖాజీపేట మండలంలోని దుంపలగట్టు గ్రామం అంటే ఫ్యాక్షన్ గ్రామంగా గుర్తింపు ఉంది. 1971లో రెండు కుటుంబాల మధ్య ఘర్షణ తలెత్తి ఇద్దరు హత్యకు గురయ్యారు.. గ్రామంలో వర్గపోరు కొనసాగేది. 1995లో కూడా ఇరువర్గాల వారు ఘర్షణకు దిగారు. 2001లో కూడా పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఇరువర్గాల మధ్య గొడవ పెద్ద ఎత్తున జరిగింది. బాంబులు కూడా వేసుకున్నారు. అప్పట్లో 30 రోజుల పాటు ఇరు వర్గాలకు చెందిన మగవారు గ్రామంలో లేరంటే ఏ స్థాయిలో గొడవలు జరిగాయో అర్థం అవుతుంది.

పరివర్తనతో ఫ్యాక్షన్‌కు దూరం..

ఫ్యాక్షన్ వల్ల ఒరిగిందేమీ లేదనీ.. ఇరు వర్గాల వారు తెలుసుకున్నారు. కుటుంబాలు చిన్నాభిన్నమై.. ప్రశాంతత కరువై పడిన వేదనను తలచుకున్నారు.. కుటుంబ సభ్యులు.. బంధువులు అనుభవించిన మానసిక వేదనను గుర్తించారు. ఇక ఫ్యాక్షన్ వద్దనుకున్నారు. పరివర్తన చెందారు. ప్రశాంత జీవనంవైపు అడుగులు వేశారు.. కలసిమెలసి ఉంటే వచ్చే ఆనందం ఆస్వాదించాలనుకున్నారు. ఘర్షణలకు స్వస్తి చెప్పారు.. ఎంత మార్పు వచ్చిందంటే 2006లో వచ్చిన సర్పంచ్ ఎన్నికలలో రెండు వర్గాల వారు కలసి సర్పంచ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తరువాత జరిగిన అన్ని ఎన్నికలు ఎలాంటి ఘర్షణ లేకుండా ప్రశాంతంగా ముగుస్తూ వస్తున్నాయి. ఆదర్శంగా నిలుస్తున్నారు.

అభివృద్ధిలో ముందంజ..

దుంపలగట్టు గ్రామంలో వెయ్యి మంది ఓటర్లు ఉన్నారు. 345 గృహాలు, 13 వందల జనాభా ఉంది. ఒకప్పుడు ఫ్యాక్షన్ గ్రామమైనా అలనాటి పరిస్థితులు నేడు లేవు. అభివృద్ధి పనులు చేసుకుంటూ గ్రామాన్ని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుకుంటున్నారు. రైతులు కూడా ఫ్యాక్షన్ వదలి వ్యవసాయరంగం పై దృష్టిసారించారు. పచ్చని పంట పొలాలతో గ్రామం కళకళలాడుతూ అన్ని రకాల పంటలు సాగు చేస్తూ ఆర్థిక పురోగతి సాధిస్తున్నారు.

పూలు.. పండ్ల తోటలతో సిరుల పంట..

గ్రామంలోని రైతులు గతంలో అందరూ వరి, పసుపు, మిర్చి పంటను అధికంగా సాగు చేసేవారు. అయితే గ్రామంలోని రమణారెడ్డి అనే రైతు మొదటిసారిగా 2004లో మల్లె పూలతోట సాగుచేసి పూల తోటల సాగుకు నాంది పలికాడు. తరువాత ఇందిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి కొత్త వంగడాల పూల తోటల సాగు చేస్తూ వచ్చారు. దీంతో గ్రామంలోని వారందరూ పూల సాగుపై దృష్టి సారించారు.

- అప్పటి నుంచి గ్రామంలోని ప్రతి రైతు తనకున్న పొలంలో కనీసం ఒక ఎకరా లేక రెండు ఎకరాల్లో పూల తోటల సాగు చేస్తున్నారు. బంతి, చామంతి, కనకాంబరం, చిట్టిరోజాలు, సంపెంగ, మల్లెపూలు ఇలా అన్నిరకాల పూల తోటలు సాగు చేస్తూ ఆర్థిక పురోగతి చెందుతున్నారు.
- పూల సాగులోని మెలకువలు పాటిస్తూ ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ పూల సాగులో ఆదర్శగ్రామంగా నిలుస్తున్నారు.



చిట్టిరోజాల పూలసాగు



కనకాంబరం చెట్లు



చెండుమల్లెపూల సాగు

ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు..

పూల సాగులో మంచి అనుభవం సాధించిన రైతులు మార్కెటింగ్‌లో కూడా ప్రత్యేకత చూపుతున్నారు. గతంలో అందరూ పండించిన పూలను కడప, ప్రొద్దుటూరు పూల మార్కెట్ యార్డులకు పంపేవారు. అయితే దీని వల్ల పెద్దగా లాభాలు రాకపోవడంతో మార్కెట్ పరిస్థితులను డిమాండ్ గుర్తించారు. అందుకు తగ్గట్లుగా హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగుళూరు, గుంటూరు, కావలి ఇలా ధర అధికంగా ఉన్న ప్రాంతాలకు పూలను ఎగుమతి చేస్తున్నారు. దీనివల్ల లాభం వస్తోంది.

పూలతోటలతో లాభాలు ..



ఆకుతోటలు సాగు చేసి తీవ్రంగా నష్టపోయాను.. నాకున్న వ్యవసాయ జ్ఞానంతో కొత్త రకాల పూలతోటలు కూరగాయల కొత్త వంగడాలను తీసుకు వచ్చి సాగు చేసుకుంటూ ఆర్థిక పురోగతి సాధించాను. నాతోపాటు చాలా మంది పూలసాగు చేస్తున్నారు. నాకున్న 5 ఎకరాల్లో ప్రతి సీజన్‌లో 2 ఎకరాలు పూలతోటలు సాగు చేస్తాను.

– ఇందిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, రైతు, దుంపలగట్టు

ఘర్షణ వల్ల నష్టం తప్ప లాభం ఉండదు..



రాజకీయాల వల్ల వచ్చే ఘర్షణతో కుటుంబాలు ఆర్థికంగా నష్టపోవడం తప్ప లాభం లేదు. అందుకే నాకున్న పొలంలో పూలతోటలు హార్టికల్చర్ పంటలు సాగుచేసుకుంటూ మంచి దిగుబడి సాధించే ప్రయత్నం చేస్తున్నాను. గ్రామంలోని చాలా మంది వ్యవసాయం పైనే దృష్టిసారించి మంచి ఫలసాయంతో ఆదాయం సంపాదించుకుంటున్నారు.

– పత్తి ఈశ్వర్ రెడ్డి, రైతు, దుంపలగట్టు

అభివృద్ధితోనే ఫ్యాక్షన్ దూరం...



గ్రామంలో సుమారు 3 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.. సీసీరోడ్లు, వీధి దీపాలతోపాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.. జలసిరి ద్వారా రైతులకు బోర్లు ఇస్తున్నాం.. గ్రామంలో ప్రతి కుటుంబం ఆర్థిక అభివృద్ధి చెందాలి. అప్పుడే ఫ్యాక్షన్ పూర్తిగా దూరమవుతుంది.

– రెడ్యం చంద్రశేఖర్ రెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు

మస్తాన్‌బన్నిని సత్కరిస్తున్న దృశ్యం



ప్రముఖుల నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న బన్నీ (ఫైల్)



నృత్య తేజం

- డ్యాన్స్‌లో రాణిస్తున్న మస్తాన్ బన్నీ
- వరించిన బహుమతులు, అవార్డులు

వీరబల్లి: వీరబల్లి మండలం వీరబల్లి గ్రామానికి చెందిన మస్తాన్ బన్నీకి నాట్యం అంటే ఎంతో ఇష్టం. గ్రామంలో ఎక్కడైనా డ్యాన్స్‌వేస్తుంటే అక్కడికెళ్లేవాడు. వారు చేసే డ్యాన్స్ చూస్తూ.. తాను కూడా నేర్చుకోవాలనుకున్నాడు. పట్టుదలతో సాధన చేసి నాట్యం నేర్చుకున్నాడు. ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి శభాష్ అనిపించుకున్నాడు. అయితే తను నాట్యం నేర్చుకోవడానికి సహాయ పడిన వారి రుణం ఎన్నటికీ తీర్చుకోలేనని చెబుతున్నాడు. ఆయన మాటల్లోనే...‘ మాది పేద కుటుంబం. మా నాన్న టైలర్. ఆ పనిచేస్తూనే కుటుంబాన్ని పోషించేవారు.. నాకు నాట్యంపై ఇష్టంతో ఆ దిశగా అడుగులు వేశా. పీలేరులో ఒక డ్యాన్స్‌స్కూల్‌లో చేరాను. అయితే అక్కడే పెయింటింగ్ పనులు చేసుకుంటూ వచ్చే అరకొర డబ్బుతో రోజులు భారంగా గడిపేవాన్ని. ఈ తరుణంలో అక్కడి ఝాన్సీ హాస్పిటల్ డాక్టర్ దినేష్‌రెడ్డి నన్ను ఆదరించారు. కొన్నేళ్ల వరకు తిండి, ఖర్చులు అన్నీ ఆయనే చూసుకునేవారు. ఆయన సహాయ సహకారాలతో తిరుపతిలోని ఎస్.వి.మ్యూజిక్ కళాశాలలో చేరి భరత నాట్యంలో తర్ఫీదు పొందుతున్నా. ‘వే’ ఫౌండేషన్ సంస్థ వారు నా టాలెంట్‌ను చూసి ఢిల్లీదాకా తీసుకెళ్లారు. అక్కడ నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నా. 600లకు పైగా నృత్య ప్రదర్శనలలో పాల్గొన్నా. జ్యోతిరావ్‌పూలే నేషనల్ ఫెలోషిప్ అవార్డును ఢిల్లీలో అందుకున్నా. డ్యాన్స్ పోటీల్లో ఎన్నో బహుమతులు పొందాను. ఇంకా ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి ఇంకా మంచి పేరు తెచ్చుకుంటాను. నృత్యమే నా ఆరోప్రాణం..’ అని సాక్షికి వివరించాడు.



నృత్య భంగిమలో మస్తాన్ బన్నీ



ఆడవేషంలో మస్తాన్ బన్నీ

అశ్వ నృత్యం.. అదుర్స్..



డప్పు వాయిద్యాలకు నృత్యం చేస్తున్న అశ్వం

ప్రొద్దుటూరులో వినాయకుడి గ్రామోత్సవంలో ఓ గుర్రం నృత్యం చేసి ఆకట్టుకుంది. వైఎంఆర్ కాలనీలో గణనాథుని విగ్రహాన్ని బుధవారం ఊరేగించారు. ఈ సందర్భంగా డప్పు వాయిద్యాలు, కేరళ సింగారిమేళం సందడి మధ్య ఓ గుర్రం లయబద్ధంగా నాట్యం చేసింది. భక్తులు ఆ నృత్యం చూసి ఆశ్చర్యపోయారు.

– ప్రొద్దుటూరు కల్చరల్

నగరం.. రంగులద్దుకుంటోంది..!











కడప నగరం.. రంగులద్దుకుంటోంది.. సుందరీకరణ దిశగా అడుగులేస్తోంది. నగరపాలక సంస్థ, పలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి గోడపత్రాలు, మట్టితో అధ్వాన్నంగా మారిన నగర వీధుల గోడలను అందమైన చిత్రకావ్యాలుగా మారుస్తోంది. కళాకారుల స్వచ్ఛసూక్తులు, ప్రముఖుల బొమ్మలు, గత చరిత్రను తెలిపే చిత్రాలను ఆకర్షణీయంగా రూపొందిస్తున్నారు. వీటితో పాటు డివైడర్లకు సైతం రంగులు దిద్దుతూ ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. – వైవీయూ